గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# ఫిబ్రవరి 2017
# కథలు




"ఈ పెద్దోళ్ళున్నారే ...మమ్మల్ని ఎప్పుడు అర్థం చేసుకుంటారు?"

"అరె! మేమూ పెద్దోళ్ళయ్యాం. మేజర్లయ్యామని ఎప్పుడు తెలుసుకుంటారు. మా డిసెషన్ మేము తీసుకోలేమా? మా జీవితాల్ని మేము దిద్దుకోలేమా?"

"మేమిద్దరమూ ప్రేమించుకున్నాం. పెళ్ళిచేసుకుంటామంటే నమ్మరు. ఎన్నో అనుమానాలు. చివరికి ఒప్పుకోరు. సెంటిమెంట్ తో ఏడిపిస్తారు. మేము ఏమీ చిన్న పిల్లలం కాదు. మేజర్లం. మా జీవితాల్ని నిర్ణయించుకోవడానికి మాకు హక్కు లేదా? మేమిద్దరమూ ఒకర్నొకరు విడిచిలేనంతగా ప్రేమించుకున్నాం. ఆయన లేకుంటే నేను బ్రతకలేను. సారీ! మమ్మీ..మమ్మల్ని క్షమించండి. మిమ్మల్ని కాదన్నందుకు.."

"మేము కాదనడం లేదమ్మా? నీ వయసు పద్దెనిమిదే! పాలకు నీళ్ళకు తేడా తెలియని పాల వయస్సు. పెళ్ళికిది సమయం కాదు. వయసూ కాదు. మీ పెళ్ళి మేము దగ్గరుండి ఘనంగా చేయిస్తాం. మాకు కాస్త టైమివ్వండి."

"నో...మీపైన నాకు నమ్మకం లేదు. నా మనసు మార్చడానికి ట్రై చేస్తారు. మమ్మల్ని విడదీయడానికి ప్రయత్నిస్తారు. .....ఎన్ని సినిమాలు చూడ్డం లేదు."

"లేదమ్మా! కావాలంటే రాసిస్తాము. తప్పకుండా మీ పెళ్ళి మా చేతుల మీదుగా చేయిస్తాం. మమ్మల్ని నమ్మమ్మా!"

"నో డాడీ! క్షమించండి. నేనిప్పుడు మేజర్ని. మీ కిష్టమున్నా; లేకున్నా మా పెళ్ళి ఈ రోజే; ఇప్పుడే జరిగితీరుతుంది."

"నీకిప్పుడు తెలియదే మా బాధేంటో? నీకూ ఓ కూతురు పుట్టి, అదీ ఇలా అంటే అప్పుడు తెలుస్తుందే మా బాధంటే ఏంటో?"

"అమ్మా! శాపనార్థాలు వద్దు. ప్లీజ్. నేను డెసిషన్ తీసేసుకున్నా. నా నిర్ణయం మారదు."

"అంటే ...పద్దెనిమిదేళ్ళు పెంచి పెద్ద చేసిన మాకన్నా రెండేళ్ళ పరిచయమున్న ఆ అబ్బాయే ఎక్కువైపోయాడా?"

"అవును. అతనే ఎక్కువ. అతనే నా జీవితం. అతను లేకుంటే నేను లేను."

"ఈ వయసులో నీకర్థం కాదే"

"అమ్మా! నేను మేజర్ని. నా జీవితం నా ఇష్టం. మీ కిష్టమయితే దీవించండి. లేకుంటే..."

"లేకుంటే ....ఏంటే? అంత పెద్దదానివయిపోయావా?"

"మీతో మాకనవసరం. యస్.ఐ గారూ! మాకు ప్రొటెక్షన్ కావాలి. నా ఇష్ట ప్రకారమే ఈ పెళ్ళి జరుగుతోంది. మేమిద్దరమూ

ప్రేమించుకున్నాం. పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నాం."

మాట్లాడానికింకేం లేనట్లు యస్.ఐ తో అంది మయూరి స్థిరంగా.

 స్ట్రాన్ పడి నిల్చుండిపోయారు ఆమె తల్లితండ్రులు. రెండు గంటలుగా...పోలీస్ స్టేషన్లో మీడియా సమక్షంలో కౌన్సిలింగ్ పేరిట జరుగుతున్న తతంగమిది. అక్కడ పోలీసులతో పాటు మీడియా, జనంతో క్రిక్కిరిసిపోయింది.

ఆ అమ్మాయి ఒక సెలిబ్రిటి. పేరు మయూరి. వయసు పద్దెనిమిదేళ్ళ ముప్పై రోజులు.

అదే వీధిలో డిగ్రీ ఐదేళ్ళుగా చదువుతున్న సంజయ్ ని ప్రేమించింది. వాళ్ళిద్దరూ గత రెండేళ్ళుగా గాఢంగా ప్రేమించుకుంటున్నట్లు మీడియాతో చెప్పింది. ఇప్పుడు మేజరయింది కాబట్టి పెళ్ళి నిర్ణయం తీసుకున్నారు. ఇంట్లో ఒప్పుకోరు కనుక స్వయం నిర్ణయం తీసుకున్నారు. తల్లితండ్రులకు తెలిసి పోలీస్ కంప్లైంట్ ఇస్తే; ఈ కౌన్సిలింగ్ జరుగుతోంది. పోలీసులకు ఇదో తలనొప్పిగా తయారయింది. వయసు చిన్నదే అయినా మయూరి చాలా తెలివిగా మాట్లాడుతోంది. అభిమానులు విపరీతంగా ఉన్న ఒక సెలిబ్రిటి కనుక జనంలో అంత క్రేజ్.

"ఇద్దరికీ ఉద్యోగాలు లేవు. ఎదిరించి ఎలా బ్రతుకుదామనుకుంటున్నారు?" ఓ మీడియా మిత్రుడు అడిగాడు.

"నేనో డాన్సర్ని. సంపాదిస్తున్నాను. ఐదేళ్ళుగా పర్ఫార్మెన్సన్స్ ఇస్తున్నాను. ఆయన కూడా ఏదో ఒక ఉద్యోగం చూసుకుంటాడు..."

"అదేనండి మా బాధ! ఇప్పుడిప్పుడే కెరీర్ ప్రారంభమయింది. ఇంకా ఎదగాల్సింది ఎంతో ఉంది. మేమెన్నో కలలు కన్నాం. ఇప్పుడు పెళ్ళి చేసుకుంటే కెరీర్ దెబ్బ తింటుందనే మా బాధ. మా కలలన్నీ ఒక్క రోజులో ఇలా ...." తల్లి ఆవేదనతో కళ్ళు తుడుచుకుంది.

"నేను ఎదిగి చూపిస్తాను" తల్లిని కసురుకుంది మయూరి.

"రోజు రోజుకూ నిరుద్యోగం పెరిగిపోయి; ఉద్యోగాలు రాక నిరుద్యోగులు అవస్థపడుతున్నారు. ఆయనకి కనీసం డిగ్రీ కంప్లీట్ కాలేదు. మీరు ఇంటర్ రాస్తున్నారు. పెద్ద పెద్ద డిగ్రీలు ఉన్నవారికే ఉద్యోగాలు లేవు. ఏ ధైర్యంతో మీరీ నిర్ణయం తీసుకున్నారు?" మరో మీడియా మిత్రుడి ప్రశ్న.

"చూడండీ! వీలయితే ప్రేమికుల్ని ఆశీర్వదించండి. ఇలా పిరికి మందు పోయకండి. మా ఇద్దరికీ ధైర్యముంది. హాయిగా బ్రతుకుతామన్న నమ్మకముంది. మా అమానాన్నల లాగా మా గొంతు నొక్కకండి." అసహనంగా అంది మయూరి.

అవాక్కయారు మీడియా మిత్రులు. ఆ తర్వాత వాళ్ళ గొంతు పెగలలేదు.

"చూడమ్మా!" యస్.ఐ నోరు మెదిపాడు.

"సార్!"

"మీ వయసు చిన్నది. ఇలాంటి పెద్ద నిర్ణయాలు తీసుకునే వయసు కాదు. మరోసారి ఆలోచించండి. మీ తల్లితండ్రులు కాదనడం లేదు. వారికి కొంత టైమిస్తే వారే ముందుండి పెళ్ళి జరిపిస్తామంటున్నారు. కొంచెం టైమిద్దాం."

"పదే పదే నా వయస్సును ప్రశ్నిస్తున్నారు. నా బర్త్ డే సర్టిఫికేట్ ఇచ్చాను. చట్టం ప్రకారం నేను మేజర్ని. నా నిర్ణయాలు నేను తీసుకోగల్ను."

"తొందరపాటు వద్దని మా సూచన"

"సూచనా లేక ఆర్డరా? మీరు కూడా వారితో కుమ్మక్కై ..."

"నో...నో. సూచన మాత్రమే."

"మీ సూచనకు కృతజ్ఞతలు. అవతల ముహూర్తం టైం దాటి పోతోంది. మీరు చేస్తారా? లేక మా దారి చూసుకోమంటారా?..." చేసేదేం లేకపోయింది పోలీసులకు.

అక్కడున్న పెద్దలంతా "అయ్యో! చిన్న పిల్ల తొందరపాటు నిర్ణయం తీసుకుందే!" అని బాధ పడ్డారు. కాని మయూరి స్థిరమయిన అభిప్రాయం విన్నాక ఏమీ చేయలేకపోయారు. చేసేదేమీ లేక ఆమె తల్లిదండ్రులూ వెళ్ళిపోయారు.జరగవలసిన తతంగమంతా పోలీస్ స్టేషన్ లోనే మీడియా ముందే జరిగిపోయింది. లైవ్ టెలికాస్ట్ చూసిన ఆమె అభిమానులు ఉలిక్కిపడి కళ్ళింతలు చేసుకుని టీ వీ లకు అతుక్కుపోయారు. ఎందుకో అందరి గుండెలు బరువెక్కాయి.

“మాయమాటలతో మా పిల్లను బుట్టలో వేసుకున్నాడు. అమాయకంగా వాడి మాయలో పడిపోయింది మా పిల్ల. దాని కేరీర్ నాశనం చేసుకుంది." అమ్మాయి తల్లిదండ్రుల వేదన.

"వగలాడి ఏ మందు పెట్టిందో మా పిల్లాడు మాకు కాకుండా పోయాడు. వెర్రిబాగులోడు ఎలా వేగుతాడో ఏమో..."వాపోయారు పిల్లాడి అమ్మానాన్నలు. ఎవరి పిల్లలు వారి అమ్మనాన్నలకు అమాయకులుగానే కనిపిస్తారు. కానీ వారికి తెలియని విషయమేమిటంటే; వారింకా చిన పిల్లలు కారు. అమాయకులేం కాదు.వారెప్పుడో మేజర్లయిపోయారు.

ఆ రాత్రి ప్రేమ జంట మిత్ర బృందానికి పార్టీ ఇస్తూ కోలాహలంగా వున్నారు.

ఆమె తల్లిదండ్రులు మాత్రం లైట్ కూడా వేసుకోకుండా చీకటి గదిలో తాము మయూరి చుట్టూ అల్లుకున్న గతాన్ని మరేసుకుంటున్నారు. పెళ్ళయి మూడేళ్ళకు లేకలేక పుట్టింది మయూరి.

"అరె! అది చూడు. కాళ్ళు; చేతులు ఎంత లయబద్ధంగా ఆడిస్తుందో! నా మనవరాలికి డ్యాన్స్ నేర్పించాలి. నాట్య మయూరి కావాలి. అందుకే మయూరి అని నామకరణం చేస్తున్నాను." మురిసిపోయింది నాన్నమ్మ.

అంతే కాదు బుల్లి బుల్లి నడకలలో నాట్య భంగిమలు వూహించుకొనేది. ఎన్నో కలలు కనేది. టీ వీ లలో పిల్లల డ్యాన్స్ లు

చూసినప్పుడల్లా మనవరాలిని వూహించుకునేది. వాటిని మయూరి కూడా ఆసక్తిగా చూసేది. వాళ్ళను అనుకరించేది. అది చూసి నాన్నమ్మ పొంగిపోయేది. చేతులు తట్టి ఎంకరేజ్ చేసేది. ఆమె ఆనందం చూసి మయూరి మరింతగా రెచ్చిపోయేది.

అలా నాన్నమ్మ పెంపకంలో మయూరి మనసు డ్యాన్స్ వైపు ఆకర్షింపబడింది. వయస్సు పెరిగే కొద్దీ ఆ లేత వయసులోనే ఒక డ్యాసర్నవ్వాలన్న కోరిక బలంగా నాటుకుపోయింది. వాళ్ళ ముచ్చట చూసి తండ్రికి కూడా కూతురికి డ్యాన్స్ నేర్పించాలనిపించింది.

వెంటనే డ్యాన్స్ క్లాసులో చేర్పించేశాడు. పాప కూడా ఉత్సాహంగా క్లాసులకు పోవడం; శ్రద్ధగా నేర్చుకోవడం చూసి మురిసిపోయారు దంపతులు. డ్యాన్స్ మాస్టర్ కూడా పాప శ్రద్ధను చూసి "మంచి భవిష్యత్ ఉంద"ని పాపను తెగ మెచ్చుకునేవాడు.

కానీ కొంత కాలానికి తెలిసి వచ్చింది అది తనకు తలకు మించిన భారమని. కూతురి ఆనందం ముందు చిన్న చిన్న త్యాగాలు పెద్దగా కనిపించలేదు. రాను రాను చిన్న చిన్న త్యాగాలు మరింత పెద్ద త్యాగాలుగా ఎదిగాయి. తను చేస్తున్న ప్రైవేట్ ఫ్యాక్టరీ ఉద్యోగం ఎదుగుబొదుగు లేని జీతం.... మరింత ఒత్తిడి పెంచింది. తమ అవసరాలు చాలా వరకు తగ్గించుకుని పాపతోడిదే జీవితమని ఆమె అవసరాలు తీర్చేవారు. మరో సంతానం జోలికి పోలేదు. ఎవరెన్ని చెప్పినా కూతురైనా; కొడుకైనా పాపే అనుకున్నారు. కూతుర్లోనే కొడుకుని చూసుకున్నారు.

వాళ్ళ స్కూల్లోనే మొదటి ప్రదర్శన ఇచ్చింది. చూసిన వారంతా తెగ మెచ్చుకున్నారు. ఆమె టీచర్సయితే ఏకంగా ఆకాశానికెత్తేశారు. మయూరి వల్ల తమ స్కూలుకు మంచి పేరొస్తుందని సంబరపడ్డారు. పువ్వు పుట్టగనే పరిమళిస్తున్నట్లు చిన్న వయస్సులోనే నాట్యకళ అబ్బినట్లు; ఆమె భవిష్యత్ ఉజ్జ్వలంగా ఉంటుందని ఆశీర్వదించారు. అప్పుడు దంపతులిద్దరూ ధృఢంగా నిర్ణయించుకున్నారు - పాపను ఇందులో నిష్ణాతురాల్ని చేయాలని. ఎట్టి పరి స్థితుల్లోనూ వెనుకడుగు వేయకూడదని. తమ పాపను మంచి డ్యాన్సర్ గా చూడాలని కలలు కన్నారు. మంచి గురువును ఏర్పాటు చేశారు. తల్లి కూడా బట్టల షాప్ లో పనికి కుదిరింది. బట్టలు కుట్టడం నేర్చుకుంది. తన గారాల పట్టి ఆశయం కోసం శ్రమపడింది. చన్నీళ్ళకు వేన్నీళ్ళుగా భర్తకి తోడుగా నిలబడింది. క్రమంగా మయూరి ప్రదర్శనలు స్కూలు దాటి, వూరు దాటి జిల్లా స్థాయికి పెరిగాయి.ఎవరి నోట విన్నా ప్రశంసలే. ఒక టీ .వీ. ఛానెల్ వారు ఇంటర్వ్యూ చేసి టెలికాస్ట్ చేశారు. రాష్ట్రమంతా గొప్ప పేరొచ్చింది. పత్రికలు పతాక శీర్షికల్లో అభినందించాయి.

అమ్మ టీ వీ వాళ్ళతో బతిమిలాడి రెండు మూడు ప్రోగ్రాంస్ ఏర్పాటు చేయించింది.

తల్లిదండ్రుల పూజాఫలమో; తన అదృష్టమో మయూరి గ్రాఫ్ స్టడీగా ఊర్ధ్వముఖం పట్టింది. ఆమె ప్రతిభను గుర్తించి ఒకట్రెండు సినిమా నిర్మాతలు తమ సినిమాల్లో అవకాశం ఇచ్చారు. ఇక టీ వీ లలో వివిధ ప్రోగ్రాములు. రాష్ట్రమంతా లెక్కలేని ప్రదర్శనలు. కానీ ఇవి చూడడానికి నాన్నమ్మ లేకపోయింది. ఆమె చనిపోయి అప్పుడే ఏడాది దాటింది.

మయూరి - నిండా పదిహేనేళ్ళయినా లేని ఒక మారు మూల గ్రామీణ పిల్ల ఇప్పుడు సెలబ్రిటీ. రాష్ట్రమంతా ఉర్రూతలూగించే ఒక నవ కెరటం. టీ.వి. రియాల్టీ షోలకు లెక్కే లేదు. రెండు మూడు యాడ్ షోలూ చేసింది.

ఎక్కడపోయినా ఆమె అభిమానులు. తగినట్లుగానే మయూరిలో వయసుకు మించిన పరిణతి కనిపించేది. ఎక్స్ట్రా ఆర్డినరీ పెర్ఫామెన్స్ ఇచ్చేది. మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తాపత్రయ పడేది. ఎంత ఎదిగినా ఒదిగి ఉండేది. వినయం, వినమ్రత పెద్దలపైన గౌరవం ప్రదర్శించేది. అలాంటి పిల్ల...ఇపుడు వున్నట్టుండి... ఆల్ ఆఫ్ ఎ సడెన్ ఇలా మారిపోతుందని ఎవరూ వూహించలేదు.

తల్లి వెంటనే తిరిగేది. తల్లి తోడిదే లోకమనేది. తల్లి మాట వేద వాక్కే. అలాంటి కూతుర్ని కన్నందుకు ఆ తల్లి హృదయం పొంగి పోయేది. ప్రతి క్షణం కంటికి రెప్పలా వెన్నంటి వుండేది.

నిన్నటి దాకా తన వేలు విడువని పసిపాప ఇపుడు గుండెలపై తన్ని మరొకరి వేలు పట్టుకుంది. ఆ తల్లిదండ్రులు ఆ రాత్రంతా గుండెలవిసేలా ఏడ్చారు. ఆ తండ్రి గుండె ఎప్పుడో పగిలిపోయింది. మాట మూగబోయింది. కళ్ళలో నీరెండిపోయింది. కూతురి నిర్వాకాన్ని జీర్ణించుకోలేకపోయింది. ఉదయం పదైనా తలుపులు తెరుచుకోకపోతే చుట్టుప్రక్కలవారు కిటికీ గుండా తొంగి చూసి బావురుమన్నారు. విగతజీవులై పడివున్న మయూరి తల్లిదండ్రులను చూసి. మయూరి లేని లోకంలో తమకు పనిలేదని తమ దారి చూసుకున్న వారిని చూసి ద్రవించని హృదయం లేదు. ఆమె తోడిదే లోకం, ఆమె తోడిదే బ్రతుకు అని ఎన్నో కలలు కన్న వారి కళ్ళు శాశ్వతంగా మూసుకుపోయాయి - ఇక కలలు కనే అవసరం లేనట్టు.

సరిగ్గా ఇరవై ఏళ్ళ తరవాత - పంజగుట్ట పోలీస్ స్టేషన్లో ఇద్దరు యువజంట నిల్చున్నారు.ఇన్స్పెక్టర్ ఫోన్లో మాట్లాడుతున్నాడు.

"మేడం! మీ అమ్మాయి దొరికింది. ఇక్కడే ఉంది. త్వరగా రండి." ఫోన్ పెట్టేసి ఇన్స్పెక్టర్ ఆ యువకుడి వైపు తిరిగి "ఏ రా! నీకెంత ధైర్యం ... ఈ అమ్మాయిని కిడ్నాప్ చేయడానికి" చెంప చెళ్ళుమనిపించాడు.

"లేదు సార్!..." చెంప తడుముకుంటూ వణకిపోయాడు యువకుడు.

"నన్నెవరూ కిడ్నాప్ చేయలేదు ఇన్స్ పెక్టర్ . నేనే నా ఇష్టంగానే...." అంటోంది యువతి.

ఇంతలో తుఫానులా దూసుకొచ్చింది మయూరి అక్కడికి. వస్తూనే 'ఎవడు వాడు నా కూతుర్ని కిడ్నాప్ చేసినవాడు. ఎంత ధైర్యం రా నీకు?" కాలర్ పట్టుకొని ఎడాపెడా వాయించేసింది.

"అమ్మా! అమ్మా! ఆపు." చేయి పట్టి ఆపింది కూతురు.

"ఏమిటే...?"

"నన్నెవరూ కిడ్నాప్ చేయలేదు. నా ఇష్టంగానే వచ్చేశాను."

"ఏం తక్కువ చేశానే. ఇంత పరువు తక్కువ పని చేశావు. అల్లారు ముద్దుగా పెంచానే. కంటికి రెప్పలా పెంచుకున్నానే. అడిగింది అడిగినట్లు ఇచ్చానే. మీ నాన్న మనల్ని ముంచేసి నడిరోడ్లో వదిలేసి తన దారి తను చూసుకుంటే...తండ్రిలేని లోటు రాకూడదని ప్రేమతో పెంచానే! అయ్యో! అయిపోయింది. అంతా అయిపోయింది." కుప్పకూలిపోయింది మయూరి.

అంతలోనే తేరుకుని, "సరే! అయిందేదో అయింది. పద పోదాం." అంది చేయి పట్టుకుని.

"ఎక్కడికి?" చేయి విదిల్చికొట్టింది.

"ఎక్కడికేమిటే...ఇంటికి... మన ఇంటికి.."

"నో! మమ్మీ! మేమిద్దరం ప్రేమించుకున్నాం. పెళ్ళి చేసుకుంటాం."

"కిడ్నాప్ చేసినోడితో పెళ్ళేమిటే?"

"కిడ్నాప్ లేదు. గిడ్నాప్ లేదు. నేను ఇష్టపడే వచ్చాను. నీ కంప్లైట్ వాపసు తీసుకో!"

"అదికాదమ్మా! నా మాట వినవే!"

"అమ్మా! నువ్వే నా మాట విను."

"ప్రేమ...పెళ్ళి వయసు కాదే నీది"

"నేను మేజర్ని. వయసు కాదంటావేమిటి? నాకు అన్నీ తెలుసు."

"అది కాదే..."

"ఈ పెద్దోళ్ళున్నారే...మమ్మల్ని ఎప్పుడు అర్థం చేసుకుంటారు?" మొండిగా వాదిస్తున్న కూతురి వైపు నిస్సహాయంగా చూసింది మయూరి.

"అరె! మేము మేజర్లం. మా బతుకులు మేము బ్రతకటానికి కూడా మాకు స్వేచ్ఛ లేదా?..." మాటలు తూటాల్లా వస్తున్నాయి ఆమె నోటి వెంట. మాటలు రాక మ్రాన్ పడి నిలబడిపోయింది మయూరి. ఇరవై ఏండ్ల క్రితం సంఘటన కళ్ళముందు గిర్రున తిరిగింది. ఆనాడు ఇంతే మొండిగా తను - ఇప్పటి తన స్థానంలో తన తల్లిదండ్రులు.

"మా బాధ ఇప్పుడు నీకర్థం కాదే! నీకూ ఒక కూతురు పుట్టి ..." - ఆనాటి అమ్మ మాటలు ఇంకా చెవుల్లో గింగురుమంటున్నాయి. " నా బాధలు నా కూతురు పడకూడదనుకున్నాను. ఎంతో జాగ్రత్తగా పెంచాననుకున్నాను. కానీ వయసు మాట వినదు. వేడి రక్తం ఎవరి మాటా విననివ్వదు.ఆనాడు తను వాళ్ళ మాటలు విని వుంటే తన బ్రతుకు ఇలా ఉండేది కాదు." ఘోషిగింది మయూరి మనసు.

"చూస్తారేం ఇన్స్ పెక్టర్ గారూ! మేము మేజర్లం. ప్రేమించుకున్నాం. పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాం. మాకు మా అమ్మనుంచి ప్రొటెక్షన్ కావాలి" ధృఢంగా అంటోంది కూతురు.

ఒక్కసారిగా గుండె బద్దలయి నేల మీద ఒరిగిపోయింది మయూరి - అచేతనంగా.

కాలచక్రంలో చిన్నోళ్ళు పెద్దోల్లవుతుంటారు. అనుభవం గడిస్తుంటారు. ఆ అనుభవాల్ని పిల్లలకి చెప్తుంటారు. కానీ వేడి వయసులో అవి వినిపించవు. కనిపించవు. బుర్రలోకి ఎక్కవు. వయసు పెరిగేకొద్దీ అనుభవంలోకి వస్తుంది. అనుభవాలు వారి పిల్లలకి చెబుతుంటారు. ఇది బండి చక్రంలా తిరుగుతూనే ఉంటుంది. జరుగుతూనే ఉంటుంది. ఇది ఇలా ...జరుగుతూనే ఉంటుంది.*



" రామా రావు గారి అమ్మాయి పెళ్ళికి వెడతారా?" అన్న భార్య మాటలకి కుర్చీలోంచి లేచి " ఆ వెడతాను" అని తయారు అవడానికి లేచారు జగ్గరాజు

రామా రావు గారితో ఈ మధ్య ఆధ్యాత్మిక ప్రవచనాలలో ప్రారంభమయిన పరిచయం స్నేహం గా మారింది..

అదీ కాకుండా రామారావు గారు, దగ్గర బంధువూ, ఆప్త మిత్రుడూ కాక పోయినా, ఆయన ఆప్యాయంగా పిలిచిన పద్ధతి దృష్టి లో ఉంచుకుని వెడదామని నిశ్చయించుకున్నారు.

పెళ్లి మంటపానికి వెళ్ల గానే, రామారావు గారిని పలకరించి, ఖాళీగా ఉన్న కుర్చీలలో ఒక దాంట్లో కూర్చున్నారు.

ఎవరో ఒక మధ్య వయస్కుడు సెల్ ఫోన్లో మాట్లాడుతూ ఆయన పక్కన వచ్చి కూర్చున్నాడు. మాట్లాడడం ముగించి ఫోన్ షర్ట్ జేబులో పెట్టుకుంటూ ఆయన కేసి పలకరింపుగా చూసి నవ్వాడు. "ముహూర్తానికి ఇంకా టైము ఉందనుకుంటానండి అన్నాడు. "అవును ఇంకో నలభై నిమిషాలున్నట్టుంది." అన్నారు ఈయన కూడా జవాబుగా నవ్వుతూ. పరస్పర పరిచయాలలో అతని పేరు కాళీ కృష్ణ అనీ, రామారావు గారి భార్య వైపు దగ్గర బంధువనీ తెలిసింది.

"హలో బావ గారు ఒక్కరూ కూర్చున్నారేమిటి" అంటూ ఒకతను కాళీ కృష్ణ కి అవతల పక్కన వచ్చి కూర్చున్నాడు.

'ఓ రాజా నా . ఏమిటి కులాసానా? వ్యాపారం బాగుందా? చాలా రోజులయింది" అన్నాడు కాళీ కృష్ణ జవాబుగా

"వ్యాపారానికేమండి బ్రహ్మాండంగా ఉంది." అన్నాడు ఆ రాజా అన్నాయన.

రాజా కొంచెం పెద్ద గొంతు తో మాట్లాడుతూండడం తో, జగ్గరాజు గారు వద్దనుకున్నా అతని మాటలు చెవిలో పడుతున్నాయి

కొత్తగా ఎక్స్ పోర్ట్ వింగ్ కూడా తెరిచినట్టు, దానికి కావలసిన ఏర్పాట్లకి ఏ ఏ దేశాలు తిరిగిందీ మొదలయిన వివరాలు చాలా డిటైల్డ్ గా ఒక దాని తరువాత ఒకటి గాప్ ఇవ్వకుండా ఏకరువు పెడుతున్నాడు.

కాళీ కృష్ణ గారు " ఉ " "ఆ" అంటూ ముభావంగా స్పందిస్తున్నా అతగాడు తన సెల్ ఫోన్లో వచ్చిన మెసేజిలు, వాట్సప్ లో ఉన్న వీడియో లో చూపించడం వంటివి చేస్తూ ఓ పావు గంట గేప్ లేకుండా ఏకరువు పెట్టాడు

పక్కన కూర్చున్న జగ్గరాజు గారికే చిరాకేసింది. కాళీ కృష్ణ గారు ఎలా భరిస్తున్నాడో అనుకున్నాడు

ఇంతలో కాళీ కృష్ణ గారి చొక్కా జేబులో సెల్ మోగితే అది ఆయన ఎత్తి, సిగ్నల్ కోసం కాబోలు హాల్ బయటకు వెళ్లి మాట్లాడుతున్నారు.

ఇంతలో మంటపం లో జిలకర్ర బెల్లం పెట్టె ముహూర్తం వచ్చింది కాబోలు భజంత్రీలు బాగా మ్రోగుతున్నాయి.

వీళ్ళు కూర్చున్న దగ్గరకి ఇద్దరు పదేళ్ల కుర్రాళ్ళు ఆడుకుంటూ వచ్చి వెళ్లారు.

వాళ్ళని చూడగానే గుర్తుకు వచ్చినట్టుంది. రాజా మొదలు పెట్టాడు

మా పెద్దాడు ఇంతే ఉంటాడండి. వాడు అన్ని కంప్యూటర్లూ బలే హ్యాండిల్ చేస్తాడండీ. సెల్ ఫోన్లో ఫోటోలు చాలా బాగా తీస్తాడండీ

ఇవిగో చూడండి వాడు తీసిన వీడియోలే ఇవి. అని ఒక్కొక్క వీడియో ఒకటి తరువాత ఒకటి కాళీ కృష్ణ గారికి చూపించడం మొదలెట్టాడు

కాళీ కృష్ణ గారు ఒంచెం ఇబ్బందిగా కదిలినా, అన్నీ చూస్తూ ' బాగున్నాయి. మీవాడు చాలా మంచి ఫోటో గ్రాఫర్ అవుతాడు " అన్నారు

ఇలా ఓ పది నిమిషాలు గడిచేటప్పటికి కాళీ కృష్ణ గారి చొక్కా జేబులో ఫోన్ మ్రోగింది. వెంటనే అది తీసి సిగ్నల్ కోసం కాబోలు మళ్ళీ హాలు బయటికి వెళ్లారు.

ఇంతలో ఒక పురోహితుడు వచ్చి మాంగల్య ధారణ తరువాత వేయడానికి అక్షింతలు ఇచ్చి వెళ్ళాడు

అవి తీసుకుని స్టేజి దగ్గరికి వెళ్లారు జగ్గరాజు గారు. అక్షింతలు వేసి వస్తోంటే రామారావు గారు వచ్చి పలకరించి వచ్చినందుకు థాంక్స్ చెప్పి భోజనం చేసి వెళ్లండని జగ్గరాజు గారిని భోజన శాల వైపు పంపించారు

భోజన శాల వైపు నడుస్తూంటే కాళీకృష్ణ గారు అక్షింతలు వేసి తిరిగి వచ్చి జగ్గారాజు గారిని జాయిన్ అయ్యారు

సలాడ్ టేబుల్ దగ్గర ప్లేటు తీసుకుంటూ జగ్గరాజు గారు కాళీకృష్ణ గారితో అన్నారు " రెండు మాట్లూ కూడా ఫోన్ కాల్స్ వచ్చి మిమ్మల్ని బాగా రక్షించాయే! " అన్నారు నవ్వుతూ

కాళీకృష్ణ గారు చేతిలోని ప్లేటు పక్కన టేబిల్ మీద పెట్టి "మీరు బాగా కనిపెట్టారే! నేను ఎప్పుడు కావాలంటే అప్పుడు ఫోన్

మోగుతుంది -చూస్తారా ? అని ఓ క్షణం ఆగారు . ఆయన జేబులోని సెల్ మోగింది.

" అదెలా సాధ్యం? అన్నారు జాగ్గ రాజు గారు ఆశ్చర్య పోతూ

" అంత పెద్ద కష్టం కాదండి" అని కాళీ కృష్ణ గారు ప్యాంటు జేబులోంచి ఒక చిన్న సెల్ తీసి చూపించి అన్నారు" ప్యాంటు జేబులో ఇందులో ఒకటి నొక్కగానే చొక్కా జేబులో సెల్ మోగుతుంది" ఇలాగ ఫంక్షన్లకు వచ్చినప్పుడు ఇదే నా "ఆపద్బాంధవుడు" అన్నారు నవ్వుతూ

సెల్ ఫోన్లు వచ్చిన తరువాత ఇదొక పెద్ద సౌకర్యం అన్న మాట. అన్నారు నవ్వుతూ జగ్గ రాజు గారు.

ఇదేదో భలే బావుందే అన్నారు కాళీ కృష్ణ గారి నవ్వులో నవ్వు కలుపుతూ.



త్యాగరాయ గానసభలో మ్యూజిక్ కాంపిటీషన్స్ కి కూతురు మేఘనని తీసుకుని వెళ్ళారు ఆదిత్య, నీలిమ. సెవెంత్ క్లాస్ చదువుతున్న మేఘన మూడు సంవత్సరాల నుండి కర్ణాటక శాస్త్రీయ సంగీతాన్ని నేర్చుకుంటోంది. సన్నటి స్వరంతో ఆమె రాగాలాపన చేస్తుంటే ఎంతో వినసొంపుగా వుంటుంది.

" ఈ పోటీలకి సిటీలోని అన్ని సంగీత సంస్థల నుండి పిల్లలు వస్తారు, పోటీ జనరంజకంగా వుంటుంది. మేఘన ని కూడా తీసుకుని రండి , స్టేజి మీద పాడడం మెల్లిగా అలవాటై తనకి స్టేజి ఫియర్ పోతుంది " అని మేఘనకి సంగీతం నేర్పిస్తున్న కృష్ణాచారిగారు మరీ మరీ చెప్పడంతో ఆ సంగీతం పోటీలకి మేఘనని కూడా తీసుకుని వచ్చారు.

కృష్ణాచారిగారు చెప్పినట్లుగానే చాలా మ్యూజిక్ సంస్థల నుండీ పిల్లలు వచ్చారు, ఎంతో చక్కగా లయబద్ధంగా పాడారు. మేఘన కూడా బాగానే పాడింది. కానీ ఆమె స్టేజి ఎక్కడం యిదే మొదటిసారి కావడంతో రెండు మూడు సార్లు పాట మధ్యలో తడబడడం జరిగింది.

అందరిలోకీ చాలా బాగా పాడిన యిద్దరు చిన్నారులకి ఫస్ట్, సెకండ్ ప్రైజ్ లని ప్రకటించారు.

" పోటికి రావడం మంచిదైంది కదూ ఆదిత్యా. యింత మంది పిల్లల పాటలు వినగలిగాము. బహుమతులని గెలుచుకున్న పిల్లలు చాలా శ్రావ్యంగా పాడారు కదూ. అప్పుడప్పుడూ మనం మేఘనని తీసుకుని యిలాంటి చోట్లకి వస్తుంటే తనకి కూడా స్టేజి మీద పాడడం అలవాటవుతుంది " అంది నీలిమ.

" ఔను నీలూ. చక్కటి సంగీతం వింటే మనసుకి ఎంతో హాయిగానూ, రిలాక్సింగ్ గానూ వుంటుంది. యింకాస్త ఎక్కువగా ప్రాక్టీసు చేస్తే మన మేఘన కి కూడా నెక్స్ట్ టైం ప్రైజ్ గ్యారెంటి " అన్నాడు ఆదిత్య.

" అసలు ఈ సారే నాకు ఫస్ట్ ప్రైజ్ వచ్చేది డాడీ. నేను పాడుతున్నంతసేపూ ముందు వరసలో కూర్చున్న ఒక బామ్మగారు ఒకటే దగ్గుతుంటే, నేను చాలా డిస్టర్బ్ అయాను డాడీ . దాంతో శృతి తప్పింది " అంది మేఘన.

" ఫరవాలేదులేరా. యిదే ఫస్ట్ టైం కదా నువ్వు స్టేజి మీద పాడడం, అందుకే అలా జరిగింది " అంటూ అనునయంగా చెప్పింది నీలిమ.

***

ఆ రోజు స్కూల్ నుండి యింటికి రాగానే బ్యాగు నుండి ప్రోగ్రెస్ రిపోర్ట్ ని తీసి తల్లి చేతికిచ్చింది మేఘన. మేఘనకి వాళ్ళ సెక్షన్ లో ఫిఫ్త్ ర్యాంక్ వచ్చింది. మొత్తం నాల్గు సెక్షన్స్ మీద యిరవై ఆరో ర్యాంక్ వచ్చింది.

" అదేమిటి మేఘా , ఈసారి యింత పెద్ద ర్యాంక్ వచ్చింది. సైన్సు లోనూ, కంప్యూటర్స్ లోనూ తక్కువ మార్కులు వచ్చాయి కదూ , అందుకే ర్యాంక్ బాగా డౌన్ అయింది. ఫైనల్ పరీక్షల లోపు నువ్వు ఆ రెండు సబ్జక్ట్స్ ని బాగా పికప్ చేయాలి " అంది రిపోర్ట్ కార్డు ని చూసిన నీలిమ.

నీలిమ డిగ్రీ కాలేజిలో లెక్చరర్ గా పని చేస్తోంది . చదువు విషయంలో మేఘన మీద అనవసరపు ఒత్తిడిని ఎన్నడూ పెట్టదు. కూతురిని పొరపాటున కూడా ఎవ్వరితోనూ పోల్చడంగానీ , తక్కువ చేయడం గానీ చేయదు. అవసరం అనుకున్నప్పుడు " యిలా చేస్తే బావుంటుంది " అని సలహా మాత్రం యిస్తుందంతే.

" అదేం లేదు మమ్మీ . నేను బాగానే వ్రాసాను. సైన్సు టీచర్ , కంప్యూటర్స్ టీచర్ కూడా మా స్కూల్ లో కొత్తగా జాయిన్ అయ్యారు. యిద్దరూ కూడా పరీక్ష పేపర్ల ని చాలా స్ట్రిక్ట్ గా కరెక్ట్ చేసారు. అందుకే తక్కువ మార్కులు వచ్చాయి "

కూతురి మాటలకి ప్రోగ్రెస్ రిపోర్ట్ ని మరోసారి పరీక్షగా చూసింది నీలిమ. ఆ రిపోర్ట్ కార్డు లో ప్రతీ సబ్జెక్టులోనూ సెక్షన్ ఫస్ట్ మార్క్, నాలుగు సెక్షన్ల పై క్లాస్ ఫస్ట్ మార్క్ , యింకా విడిగా స్టూడెంట్ ర్యాంక్ కూడా యిస్తారు.

" చూడు మేఘా , నీ సెక్షన్ లోనే సైన్సులోనూ, కంప్యూటర్స్ లోనూ నూటికి నూరు మార్క్ లు వచ్చిన వాళ్ళు ముగ్గురున్నారు. ఆ రెండు సబ్జక్ట్స్ లోనూ నీ సెక్షన్ లో నీ ర్యాంక్ పదికి పైనే వుంది. నువ్వు చెప్పినట్లుగా మీ టీచర్స్ స్ట్రిక్ట్ అనుకుంటే నీ పైన వున్న పదిమందికీ మంచి మార్కులు వచ్చేవి కావుగా. ఒక్క విషయం అర్థం చేసుకో మేఘా. పరీక్షలనేవి మనం చదువులో ఏ స్థాయి లో వున్నామనేది తెలియడం కోసం పెట్టినవి. అంటే పరీక్షలలో వచ్చిన మార్కు లని బట్టి మనం ఏ సబ్జెక్టు లో , ఏ చాప్టర్ లో వీక్ గా వున్నామనేదాన్ని అర్థం చేసుకుని , మరింత బాగా చదివి మనని మనం యింప్రూవ్ చేసుకోవడం కోసమే పరీక్షలున్నది . అంతే కాని టీచర్ స్ట్రిక్ట్ అనీ, లేదా పేపర్ కష్టంగా వచ్చిందనీ వేరే వేటి మీదకో నెపాన్ని త్రోసేసేటందుకు కాదు "

" పోమ్మా , నువ్వు మరీనూ, ప్రతీ దానికీ ఎక్కువగా ఆలోచిస్తావు " అనేసి వెళ్ళిపోయింది మేఘన.

***

ఆ రోజు జిల్లాస్థాయిలో జరుగుతున్న బాడ్మింటన్ టోర్నమెంట్ లో ఆడించేందుకు కూతురిని తీసుకుని వెళ్ళాడు ఆదిత్య. ఒకప్పుడు ఆదిత్య స్టేట్ లెవెల్ బాడ్మింటన్ ఛాంపియన్ . యిప్పటికీ అతని ఆఫీస్ లో జరిగే మ్యాచ్ లో ఎప్పుడూ అతనిదే ఫస్ట్ ప్రైజ్. దగ్గరుండి కూతురికి కోచింగ్ యిస్తున్నాడు .

సాయంత్రం యింటికి వచ్చిన తరువాత నీలిమ కూతురిని అడిగింది " టోర్నమెంట్లో బాగా ఆడావా మేఘా ? ప్రైజ్ ఎవరికి వచ్చింది?"

"బాడ్మింటన్ డబుల్స్ లో నా పార్టనర్ బాగా ఆడలేదమ్మా , అందుకే సెమీ ఫైనల్స్ లో ఓడిపోయాము "

" పోనీలే, అప్పుడప్పుడూ యిలాంటివి జరుగుతూనే వుంటాయి . ఎక్కువగా ఫీల్ అవ్వకు. మరి సింగిల్స్ ఏమైంది ? "

" డాడీ టోర్నమెంట్ కి ఆలస్యంగా తీసుకుని వెళ్ళారమ్మా. దాంతో నాకు టెన్షన్ ఎక్కువై సరిగా ఆడలేకపోయాను . అందుకే అదీ సెమీఫైనల్స్ లో పోయిందమ్మా "

" పోతే పోయిందిలే మేఘా . ఈసారి యింకా బాగా ప్రాక్టీసు చేసి వెళ్ళు. ప్రస్తుతానికి స్టడీస్ మీద బాగా ఫోకస్ చేయి" అంటూ కూతురిని ఓదార్చింది నీలిమ

ఆ రాత్రి డిన్నర్ చేసిన తరువాత బాగా అలిసిపోయిందేమో త్వరగా నిద్రపోయింది మేఘన. వంటిల్లు సర్దేసిన తరువాత బెడ్ రూమ్ లోకి వచ్చింది నీలిమ.

" మన మేఘ బాడ్మింటన్ లో రాకెట్ గ్రిప్ ని కొద్దిగా మార్చుకుంటే సూపర్ గా షైన్ అవుతుంది నీలూ. ఈ వేళ టోర్నమెంట్ డబుల్స్ లో మేఘ తో బాటు ఆడినమ్మాయి చాలా బాగా ఆడింది"

" మేఘ వేరేగా చెప్పిందే " అనుకుంటూ మనసులోనే ఆశ్చర్యపోయింది నీలిమ . అంతలోనే గుర్తుకురాగా అడిగింది " ఆదిత్యా , ఈ

వేళ టోర్నమెంట్ కి ఆలస్యం గా వెళ్ళారటగా. మేఘన టెన్షన్ పడిందిట పాపం. “

“ అదేం లేదే. టైం కే వెళ్ళాము. మేం వెళ్లేటప్పటికి బాయ్స్ టోర్నమెంట్ మొదలయింది. మేం వెళ్ళిన పావుగంటకేమో మన మేఘా వాళ్ళ ఆట స్టార్ట్ అయింది “

ఆదిత్య యిచ్చిన సమాధానంతో ‘ తన తప్పు తాను తెలుసుకుని , సరిదిద్దుకునేందుకు బదులుగా ప్రతీదానికీ యిలా వేరే దేని మీదకో నెపాన్ని తోసేయడం కూతురికి అలవాటుగా మారింది ‘ అన్న విషయం నీలిమకి రూఢీగా అర్థమయింది.

***

ఆ రోజు స్కూల్ నుండి వస్తూనే “ అమ్మా మా కంప్యూటర్ టీచర్ చాలా బ్యాడ్. చూడు సి లాంగ్వేజ్ ప్రోగ్రాం లో ఒక్క స్టెప్ వ్రాయడం మరిచిపోతే పూర్తిగా అయిదు మార్కులనీ తీసేసింది “ అంది మేఘన.

“ ఏది చూపించు“ అని మేఘనని అడిగి తీసుకుని ఆ ప్రోగ్రాం ని చూసింది నీలిమ. నీలిమ ఎంసిఏ చదివింది కాబట్టి కంప్యూటర్ లో సి లాంగ్వేజ్ క్షుణ్ణంగా తెలుసు.

“ చూడు మేఘా, నువ్వు మరిచిపోయిన స్టెప్ ఏదో సింపుల్ స్టెప్ కాదు. ప్రోగ్రాం రన్ అవడానికి అతి ముఖ్యమైన లాజిక్ స్టెప్పు అది. అందుకే పూర్తిగా మార్కులని కట్ చేసింది మీ టీచర్. ఒక్క విషయం మేఘా. ఈ మధ్య ప్రతీ విషయంలోనూ నీ తప్పుని నువ్వు తెలుసుకుని నిన్ను నువ్వు కరెక్ట్ చేసుకునేందుకు బదులుగా వేరే ఎవరి మీదకో నెపాన్ని త్రోసేసి తృప్తి పడుతున్నావు. నీ తల్లిదండ్రులైన మమ్మల్ని కూడా ఏదో ఒకటి చెప్పేసి మభ్య పెట్టాలని చూస్తున్నావు. అది మంచి పద్ధతి కాదు. ఎందులోనైనా మనం ఫెయిల్ అయితే ‘ అలా ఎందుకు జరిగింది ? మరోసారి అలా జరగకుండా ఉండాలంటే మనమేం చేయాలి, ఎలా యింప్రూవ్ అవ్వాలి ‘ అనే దాన్ని గురించి ఆలోచించాలి . అంతేగాని సింపుల్ గా కారణాన్ని దేని మీదకో నెట్టేస్తే యిక జీవితంలో మనం ఎదగడమంటూ జరగదు “ అని కూతురికి కాస్త గట్టిగానే చెప్పింది నీలిమ.

తల్లి మాటలకి ఆలోచనలలో పడిందేమో మరి ఏం మాట్లాడలేదు మేఘన. ఆ తరువాతా అడపాదడపా యిలాంటి సంభాషణలు, హితబోధలు కొన్నాళ్ళ పాటు జరిగాయి నీలిమకి, మేఘనకి మధ్యన.

***

యింటరు కి రావడంతో యిక బాడ్మింటన్, మ్యూజిక్ లాంటివన్నింటిని తగ్గించుకుని చదువు మీదే పూర్తిగా దృష్టిని పెట్టింది మేఘన. స్వతహాగా తెలివైన పిల్లే కావడంతో యింజనీరింగ్ ఎంట్రన్స్ లో మంచి ర్యాంక్ తెచ్చుకుని యింజనీరింగ్ కాలేజ్ లో చేరింది.

యింజనీరింగ్ చివరి సంవత్సరంలో వుండగానే క్యాంపస్ యింటర్వ్యూ లు రావడం మొదలయ్యాయి. మొదటి రెండు కంపెనీ లు పెట్టిన రాత పరీక్షలో పాస్ అయినా కూడా యింటర్వ్యూలో సెలెక్ట్ అవకపోవడంతో బాగా డిసప్పాయింట్ అయింది మేఘన.

" నా కంటే తక్కువ మార్కులు వచ్చిన మహతి , రవళి కూడా సెలెక్ట్ అయారమ్మా . యింటర్వ్యూ అంతా బోగస్ లా వుంది " అని చిరాకు పడుతున్న కూతురిని సముదాయించింది నీలిమ.

" ప్రైవేటు కంపెనీ లు మార్కులతోపాటు సాఫ్ట్ స్కిల్స్ ని కూడా చూస్తారు మేఘూ. మీరు ఎలా మాట్లాడుతున్నారు, మీలో టీం స్పిరిట్ ఉందా , ఎంత పాజిటివ్ గా, ఎంత క్రియేటివ్ గా ఆలోచించగలరు , పబ్లిక్ స్పీకింగ్ అలవాటుందా యిలాంటివన్నీ గమనించేటందుకే వాళ్ళు మిమ్మల్ని పర్సనల్ యింటర్వ్యూ చేసేది. అందుకని యిలాంటి సాఫ్ట్ స్కిల్స్ లో ట్రైనింగ్ ని తీసుకుని ఆ తరువాత యింటర్వ్యూ కి అటెండవు. నీకు ఉద్యోగం తప్పకుండా వస్తుంది " అంటూ కూతురికి ధైర్యం చెప్పింది నీలిమ.

నీలిమ చెప్పినట్లుగానే యింటర్వ్యూ కి ఎలా ప్రిపేర్ అవాలనే దాని మీద ట్రైనింగ్ తీసుకున్న తరువాత క్యాంపస్ కి వచ్చిన ఒక పెద్ద కంపెనీ లో ఉద్యోగానికి సెలెక్ట్ అయింది మేఘన.

" అమ్మా, నువ్వు నా చిన్నతనం నుండి చెబుతున్నావు కదూ ' ఏ విషయం లోనైనా సరే ఫెయిల్ అయినప్పుడు , మనలో లోపం ఏమిటనేది తెలుసుకుని దాన్ని సరిదిద్దుకుని మనని మనం యింప్రూవ్ చేసుకుంటే ఆ తరువాత గెలుపు మనదే అవుతుంది ' అని. యింత కాలానికి ప్రాక్టికల్ గా నాకా విషయం బోధపడింది. థాంక్స్ అమ్మా " అంటున్న కూతురిని సంతోషంగా హృదయానికి హత్తుకుంది నీలిమ.

***

ఆ తరువాత మేఘన వడి వడిగా కార్పొరేట్ నిచ్చెన మెట్లనెక్కేసి పెద్ద పొజిషన్ లో స్థిరపడింది. తనతోపాటు అదే కంపెనీ లో చేస్తున్న

తన సీనియర్ ని ప్రేమించి పెళ్లి చేసుకుని అమెరికాలో స్థిరపడింది.

వాళ్లకి యిప్పుడు ఒక పాప, పేరు లాస్య. కూతురి పురిటికి సహాయానికని అమెరికాకి వెళ్లి ఆరు నెలలుండి వచ్చారు ఆదిత్య, నీలిమ దంపతులు.

***

మూడు నెలల క్రిందట ఉద్యోగం నుండి రిటైర్ అయాడు ఆదిత్య. ఆ తరువాత రెండు నెలలకే నీలిమ కూడా వాలెంటరీ రిటైర్ మెంట్ తీసుకుంది.

" అమ్మా , మీరిద్దరూ రిటైర్ అయిపోయి ఫ్రీ గా వున్నారు కదా. లాస్య పుట్టినప్పుడు తప్ప మళ్ళీ యింతవరకూ మీరు యిక్కడికి రానేలేదు. సరదాగా అమెరికా కి రండమ్మా " అని కూతురు చెప్పడమే కాకుండా అల్లుడు కూడా బలవంతపెట్టడంతో ఆదిత్య, నీలిమ అమెరికా కి ప్రయాణమయ్యారు.

***

అమెరికా కి వెళ్ళిన వారం రోజుల వరకూ జెట్ లాగ్ తోనే సరిపోయింది నీలిమకి , ఆదిత్యకీ. ఆ తరువాత మనవరాలి వచ్చీరాని తెలుగు మాటలతో తెలికుండానే నెల రోజులు గడిచిపోయాయి.

ఆ తరువాత లాస్య కి స్కూల్ తెరిచారు. మనవరాలు స్కూల్ కి వెళ్లిపోయేటప్పటికి రోజంతా బోర్ గా అనిపించింది యిద్దరికీనూ. అయితే యిద్దరికీ పుస్తక పఠనం బాగా అలవాటుండడంతో మనవరాలు స్కూల్ నుండి యింటికి తిరిగి వచ్చేవరకూ ఏదో ఒక పుస్తకం చదువుతూ కాలక్షేపం చేస్తున్నారు. శని, ఆది వారాలలో అందరూ కలిసి వెళ్లి అవీ యివీ దగ్గరి ప్రదేశాలని చూసి వస్తున్నారు.

***

ఆ రోజు లాస్య కి స్కూల్ లో రిపోర్ట్ కార్డు యిస్తారు. లాస్య తో పాటు మేఘన కూడా స్కూల్ కి వెళ్లి రిపోర్ట్ కార్డు ని తీసుకుని వచ్చింది. రిపోర్ట్ కార్డుని చూస్తూనే " ఏమిటిది లాస్యా ? యింగ్లీష్ లాంగ్వేజ్ లో యింత తక్కువ మార్కులు వచ్చాయీసారి " అని మేఘన అడుగుతుండగా సగంలోనే సమాధానం చెప్పింది లాస్య

" మమ్మీ, మా యింగ్లీష్ టీచర్ కొత్తగా స్కూల్ లో జాయిన్ అయింది. ఆమె ఉచ్చారణ నాకు సరిగా అర్థం కావట్లేదు , అందుకే తక్కువ మార్కులు వచ్చాయి "

" అదేంటి లాస్యా, మీ యింగ్లీష్ టీచర్ వెకేషన్ కి ముందే మీ స్కూల్ లో చేరిందిగా. వెకేషన్ కి ముందర జరిగిన యింగ్లీష్ లాంగ్వేజ్ పరీక్షలో నీకు మార్కులు బాగానే వచ్చాయి కదా. అప్పుడిలా టీచర్ ఉచ్చారణ అర్థమవట్లేదని నువ్వు అనలేదుగా " అని నిలదీసిన మేఘనకి కూతురు లాస్య చెప్పిన సమాధానంతో మతి పోయినట్లయింది." అది కాదు మమ్మీ. మరి గ్రాండ్ పా , గ్రాండ్ మా వచ్చారు కదా మన యింటికి. మీ ముగ్గురూ కలిసి రోజూ గట్టి గట్టిగా మాట్లాడుతూ కబుర్లు చెప్పుకుంటుంటే నాకు బాగా డిస్టర్బ్ అయి సరిగా చదవలేకపోయాను. అందుకని తక్కువ మార్కులు వచ్చాయి "వింటున్న నీలిమ ఫక్కున నవ్వేసింది.

" మేఘా , నీ కూతురు అచ్చం నీ పోలికే. నీ నోట్లోంచి ఊడిపడి నీ గుణగుణాలనే పుణికి పుచ్చుకుంది. నీ లాగే చక్కగా ఎవరో ఒకరి మీదకి నెపాన్ని త్రోసేస్తోంది "

" గట్టిగా అనకమ్మా . అది విందంటే యింక పర్మనెంట్ గా జీన్స్ మీద నెపాన్ని పెట్టేస్తుంది. ఈ విషయాన్ని నేను ఎప్పుడో గమనించాను. ఎన్నో సార్లు దానికి చెప్పి చూసాను, కానీ అది నా మాట వినట్లేదు. యింకాస్త గట్టిగా చెప్పబోతే ' పో మమ్మీ నీకేం తెలీదు ' అంటూ నన్ను తీసిపారేస్తోంది. ఎలాగోలా నువ్వే దానికి నచ్చజెప్పి ఈ అలవాటుని మాన్పించాలి అమ్మా " అంది మేఘన బెంగగా.

" పిచ్చి పిల్లా. ఈ మాత్రం దానికే అంత బెంగా . నేను చూసుకుంటాలే " అంటూ హామీ యిచ్చింది నీలిమ.

***

ఆ రోజు ఆదివారం. లాస్య తన లాప్ టాప్ లో వీడియో గేమ్ ఆడుకుంటుంటే , నీలిమ మనవరాలి ప్రక్కనే కూర్చుని ఆ ఆటని గురించిన వివరాలని అడిగిందే తడవుగా ఎంతో ఉత్సాహంగా కి ఆట గురించి పూర్తిగా విడమరిచి చెప్పడమే కాకుండా దగ్గరుండి ఆమెతో రెండు మూడు గేమ్స్ ని కూడా ఆడించింది లాస్య.

ఆ తరువాత మెల్లిగా టాపిక్ ని తనకి కావలసినట్లుగా డైవర్ట్ చేసింది నీలిమ.

" లాస్యా , నీకు ఎప్పుడైనా మార్కులు తక్కువొచ్చినా , లేదా ఏదైనా ఆటలో ఓడిపోయినా అలా జరగడానికి నువ్వు ఏ విధంగా బాధ్యురాలివో అనేదాన్ని గురించి ఆలోచించి నువ్వు చేసిన పొరపాట్లని సరి చేసుకుంటే జీవితంలో త్వరగా ఎదగగలుగుతావు. కాని నువ్వు అలా చేయకుండా నెపం వెంటనే వేరే దేనిమీదకైనా తోసేసావంటే నీ అభివృద్ధికి నీవే అడ్డం పడుతున్నావని అర్థం కదూ" మృదువుగా చెప్పింది నీలిమ.

" నీకేం తెలీదు గ్రానీ . నువ్వు చెప్పేవన్నీ యిండియా లో ముసలాళ్ళు చెప్పేవి . యిక్కడ అమెరికన్ లైఫ్ స్టైల్ కి నువ్వు చెప్పేవేవి సూట్ అవ్వవు "

" యివి యిండియా మాటలు కావు అమ్మడూ. సరే ఒక్క విషయం చెప్పు . నైన్త్ స్టాండర్డ్ చదువుతున్నావుగా . స్టీఫెన్ కోవే పేరు విన్నావా ? "

"' ఎందుకు వినలేదు. అతను గొప్ప యింగ్లీష్ రచయిత. ఎన్నో మంచి బుక్స్ వ్రాసాడు "

" గుడ్. అయితే అతను వ్రాసిన ' సెవెన్ హాబిట్స్ ఆఫ్ హైలీ ఎఫెక్టివ్ పీపుల్' అంటే ' అత్యంత ప్రతిభావంతులైన వారి ఏడు అలవాట్లు' అన్న పుస్తకాన్ని చదివావా ఎప్పుడైనా "

" మా స్కూల్ లైబ్రరీ లో ఆ పుస్తకాన్ని చూసాను , కానీ నేను చదవలేదు "

"అందులో స్టీఫెన్ కోవే చెప్పిన ఫస్ట్ స్టెప్ ఏమిటో తెలుసా ' నీ చర్యలకి నువ్వే బాధ్యత తీసుకో అంతే కానీ నెపం వేరే వ్యక్తులకి గానీ , పరిస్థితులకి గానీ ఆపాదించకు. అలా నీ చర్యలకి నీవే బాధ్యతని తీసుకోవడం వలన నిన్ను నీవు యింప్రూవ్ చేసుకుని నీ

మీద నువ్వు పూర్తిగా కంట్రోల్ ని  తెచ్చుకోవడం జరుగుతుంది ‘  అని చెప్పాడు స్టీఫెన్ కోవే . నా దగ్గర వుంది ఆ పుస్తకం. ఆ పుస్తకంలో ఆ చాప్టర్ ని పూర్తిగా చదివిన తరువాత మాట్లాడు “ అని నీలిమ కాస్త గట్టిగా చెప్పడంతో వెంటనే ఆ పుస్తకాన్ని నీలిమ దగ్గర నుండి తీసుకుని పట్టుదలగా గంటలోనే ఆ చాప్టర్ మొత్తం చదివింది లాస్య.

చదవడం పూర్తి అయిన తరువాత సోఫా లో కూర్చున్న నీలిమ దగ్గరకి వచ్చింది లాస్య .

“ గ్రానీ , యూ ఆర్ కరెక్ట్ . కోవే చెప్పినవే నువ్వు చెప్పావు. బట్ నాకొక సందేహం . నువ్వంటే బాగా చదువుకున్నావు, ఇంగ్లీష్ బాగా వచ్చు కాబట్టి ఆ పుస్తకాలని చదివి వాటిలో వున్న చక్కటి విషయాలన్నింటిని నాకు విశదీకరించి చెబుతున్నావు. మరి ఇండియా లో వుండి  చదవడం రాని తల్లిదండ్రులకి పుట్టిన పిల్లలకి  యిటువంటి మంచి విషయాలన్నీ ఎలా తెలుస్తాయి?“

“ లాస్యా, అమెరికాలాంటి దేశాలలో కుటుంబ వ్యవస్థ అంటూ లేదు కాబట్టి స్టీఫెన్ కోవే లాంటి వారు తమ మేధస్సునంతా ఉపయోగించి చక్కటి పుస్తకాల ద్వారా ప్రజలకి జ్ఞానాన్ని పంచారు. కానీ యిండియా లో బలమైన కుటుంబ వ్యవస్థ వుంది కాబట్టి పుస్తకాల అవసరం లేకుండానే యింట్లో వుండే పెద్దవాళ్ళు అంటే బామ్మలు, అమ్మమ్మలు , తాతల ద్వారా అన్ని విధాలైన జ్ఞానమూ ఒక తరం నుండి మరో తరానికి చేరుతుంది. అయినా అన్ని పర్సనాలిటీ డెవలప్ మెంట్ పుస్తకాలకీ మూలమైన భగవద్గీత పుట్టిందే యిండియాలో. గీత ద్వారా ప్రపంచానికి కృష్ణుడు అందించిన జ్ఞానాన్ని యిండియా లో పిల్లలకి అక్కడి పెద్దవాళ్ళు కథల రూపంలో చెపుతారు. కాకపోతే యిప్పుడు యిండియా లో కూడా కుటుంబ వ్యవస్థ మెల్లి మెల్లిగా కుంటుపడుతోంది కాబట్టి ముందు ముందు అక్కడి వాళ్ళు కూడా మీ లాగే పుస్తకాల పైనే ఆధారపడవలసి వుంటుంది.  ఏది ఏమైనా మేమంతా కూడా పెద్దలంటే ఎంతో గౌరవభావంతో మెలిగే వాళ్ళం,  మా పెద్దవాళ్ళు  చెప్పిన మాటలని బుద్ధిగా వినేవాళ్ళం, తూచా తప్పకుండా పాటించే వాళ్ళం.  అంతేగానీ ‘ నీకేం తెలిదు పో అమ్మా ‘ అంటూ మా పెద్దలని తీసి పారేయలేదు ”

నీలిమ చెపుతున్నదంతా ఆసక్తి గా వింటున్న లాస్యకి ఆమె చివరలో చెప్పిన మాటలు చురుక్కున తగిలినట్లున్నాయి.

అక్కడే  హాల్లోనే  వుండి డైనింగ్ టేబుల్ ని శుభ్రం చేస్తూ ఈ సంభాషణంతా వింటున్న మేఘన దగ్గరకి వెళ్లి “ సారీ మమ్మీ, నా మంచి కోరి నువ్వు నన్ను సరిదిద్దాలని చూసిన ప్రతీసారి నీతో నేను రూడ్ గా మాట్లాడాను. నిన్ను నొప్పించాను. యింకెప్పుడూ అలా చేయను మమ్మీ “ అని అంటున్న కూతురిని ప్రేమగా దగ్గరకు తీసుకున్న మేఘనని చూస్తూ

“ పిల్లలు తమ తప్పు తాము తెలుసుకుని సరిదిద్దుకున్నప్పుడు ఆ తల్లిదండ్రులకి కలిగే ఆనందం అనిర్వచనీయం “ అనుకుంది నీలిమ మనసులోనే తృప్తిగా.




టక్..టక్..

తలుపు తట్టిన శబ్దానికి పార్వతమ్మకు మెలకువ వచ్చింది.

"ఏవండీ.."

"ఊఁ"

"ఏవండీ.."

"చెప్పు పార్వతీ..ఏంటి?" నిద్ర నుంచి బయటకొస్తూ అన్నారు శివనాథంగారు.

"ఎవరో తలుపు కొట్టిన చప్పుడయిందండీ"

కళ్లజోడు పెట్టుకుని గోడగడియారం సమయం తెల్లవారు ఝామున మూడున్నర గంటలు చూపిస్తుండడం చూసి "ఈ సమయంలోనా?" అంటూ వెళ్లి తలుపు పక్కన ఉన్న కిటికీ రెక్క తీసి "ఎవరూ" అన్నారు.

"నేను నాన్నా వీరేంద్రను"

"నువ్వా? అదేంట్రా వస్తున్నట్టు చెప్పనయినా లేదు" అంటూ గబ గబ తలుపుతీసి, కోడల్ని, మనవడు, మనవరాలిని చూసి ఆశ్చర్యపోతూ

"పార్వతీ, ఇవాళ మనింటికి పండగ వచ్చిందే, అబ్బాయి, అమ్మాయి, పిల్లలూ వచ్చారు" అన్నారు ఆనందాన్ని మాటల్లో మూటగడుతూ..

కిటికీ లోంచి 'నేను వీరేంద్రను' అన్న మాట విన్నప్పుడే మంచం మించి లేస్తున్న పార్వతమ్మ, భర్త అన్న 'అందరూ వచ్చారన్న' మాట విని వడి వడిగా తలుపుదగ్గరకు వచ్చి"రండి..రండి" అని " తెల్లవారు ఝామున వచ్చారు

తెల్లారే దాకా పడుకోండి" అని లోపలికి దారితీసింది సంతోషంగా.

"మేము నానమ్మ మంచం మీద పడుకుంటాం" అని పిల్లలు వెళ్లి మంచం మీద పడుకున్నారు.

"వచ్చింది ఫ్లైట్ లోనే కదా..మేము బాగానే విశ్రాంతి తీసుకున్నాం అమ్మా.."అన్నాడు.

"పండగలకు, పబ్బాలకు, శుభకార్యాలకు ఎన్ని సార్లు ఫోన్లో రమ్మన్నా, పని ఒత్తిడిలో రాలేనసే నువ్వు, అమ్మాయిని పిల్లల్ని తీసుకుని అనుకోకుండా.. హటాత్తుగా భలే వచ్చావురా.. మాకెంత సంతోషంగా ఉందో చెప్పలేను" సంబరపడిపోతున్నారు ముసలి దంపతులు.

*****

రోజులు గిర గిర తిరుగుతున్నాయి.

వాళ్ల రాకతో ఇల్లు కళ కళ లాడిపోతోంది. పండగేం లేకపోయినా..దాదాపు అలాగే ఉంది.

తండ్రిని మోటరు బైక్ మీద ఎక్కించుకుని ఊరంతా తిప్పాడు. అమ్మా, నాన్నల్ని డాక్టర్ కు చూపించి, టెస్ట్ లు చేయించి, మందులు రాయించాడు.

కోడలు ఉమ అత్తగారిని కాలు కింద పెట్టనీయడం లేదు. వంటింటి పనంతా పనివాళ్లతో సమానంగా గిర గిర తిరుగుతూ చేసేస్తోంది.

ముసలి వాళ్లు మనవడు మనవరాలికి కథలు చెబుతూ, పొడుపు కథలు విప్పమని సవాలు చేస్తూ, శతకాలు వల్లెవేయిస్తూ హాయిగా గడిపేస్తున్నారు. కొన ఊపిరిలో ఉన్న ప్రాణం మళ్లీ వచ్చినంత ఆనందంగా ఉన్నారు. లోపల మాత్రం ఎప్పుడో ఒకప్పుడు 'ఇహ మేము వెళ్లొస్తాం' అన్న మాట వాళ్ల నుంచి వినాల్సివస్తుందన్న బెరుకు మనసును దొలిచేస్తోంది.రోజులు, వారాలు, నెలలుగా తిరుగుతున్నాయి.

వీరేంద్ర మాత్రం అప్పుడప్పుడూ ఫ్రెండ్స్ ను కలవడానికని పట్నం వెళ్లి వస్తున్నాడు.

*****

ఒకరోజు.

"నేనొచ్చి ఇంతకాలమైనా కదలడం లేదేమిటా? అని ఆశ్చర్యపోతున్నారు కదూ..చెబుతాను. నాకు ఊహ వచ్చినప్పుడోసారి నాన్న, నన్ను ఆ పెద్ద పెట్టె దగ్గరకి తీసుకెళ్లి, నేను చిన్నప్పుడు ఆడుకున్న బొమ్మలు, వేసుకున్న బట్టలు, పిచ్చిగీతలు గీసిన పుస్తకాలు, వాడిన పెన్సిళ్లు, పెన్నులు, అప్పటి చిన్ని సైజు చెప్పులూ, స్కూల్లో అందుకున్న బహుమతులు, టీచర్లు గుడ్ రాసిన

నోట్ బుక్స్, స్టూడియోలో తీయించిన ఫోటోలు చూపించి "నువ్వు మాకు ఎంతో అపురూపం రా..నీకు సంబంధించిన ప్రతీది ఇందులో భద్రపరిచాం. నీ పుట్టుక దగ్గర్నుంచి ఎదగడం దాకా మాకెన్నో మధురానుభూతుల్ని మిగిల్చింది. ఎప్పుడన్నా వాటిని తీసి చూస్తుంటే మాకెంత సంతోషంగా ఉంటుందో' అన్నావు అలౌకిక ఆనందంలో తేలిపోతూ.

అమ్మ ఒకసారి ఫోన్లో మట్లాడుతూ' వీరూ, నువ్విక్కడ లేకపోవడం ఈ వయసులో మాకు పెద్ద లోటురా, ఇల్లంతటికీ మేమిద్దరమే! పెట్టెలోని నీకు సంబంధించిన వస్తువులను చూస్తూ కొంతలో కొంత తృప్తి పడుతున్నాంరా..కానీ నువ్వు మా ఎదురుగా ఉంటేనే మాకు సంతోషం" అంది. వింటున్న నా కళ్లు చెమర్చాయి.

పాతికేళ్లు న్యూజెర్సీలో ఉద్యోగ జీవితం గడిపాక..డబ్బు వెనక పరుగు ఇక ఆపెయ్యాలనిపించింది. మీ దగ్గరుంటే ఆ అనుభూతి వేరు. అది కోల్పోకూడదనిపించింది. జీవితంలో డబ్బు ఒక భాగం. కానీ డబ్బే జీవితం కాదు. మానవుడి జీవితం పెళ్లి, పిల్లలతో మొదలై మనవలతో గడిపేటప్పుడు ముగుస్తుంది. అదీ పరిపూర్ణ జీవితం అంటే. ఒక కొడుగ్గా అది మీకివ్వడం నా ధర్మం. నన్నింతవాడిని చేసిన మిమ్మల్ని జాగ్రత్తగా చూసుకోవాలి. నేనుండగా వృద్ధాప్యం మీకు శాపం కాకూడదు. బతకడానికి కావలసింది సంపాదించాను. సుఖాలకు లొంగిపోతే బంధాలు మృగ్యమవుతాయి. నా పిల్లలు విదేశాల్లో ఉన్నారని చెప్పుకోవడం, నడి వయసులో సరైనదేమో కానీ వృద్ధాప్యంలో మాత్రం 'పిల్లలు నా దగ్గరే ఉన్నారని' గర్వంగా చెప్పుకోగలగాలి. సంపాదించిన డబ్బును సిటీలో ఇన్వెస్ట్ చేశాను. మీకు ఏ మెడికల్ రిక్వయిర్మెంట్ వచ్చినా, మరే అవసరం వచ్చినా జాగ్రత్తగా చూసుకోవడానికి కావలసిన డబ్బు ఉంది. ఇప్పుడు నే చెప్పినవన్నీ ఉమ తల్లిదండ్రుల విషయంలోనూ వర్తిస్తాయి. వాళ్లనీ ఉమా, నేను జాగ్రత్తగా చూసుకోవాలి. మనవళ్లతో వాళ్లూ ఆడుకోవాలి. తమ అనుభవాలను పిల్లలతో పంచుకోవాలి. నా పిల్లలు పరదేశంలో, అక్కడి సంస్కృతిలో పెరగాలని మేము కోరుకోవడంలేదు. ఇక్కడి మట్టిలో, మనుషులతో, ముఖ్యంగా మీతో బంధం ఏర్పడాలి. 'దేశమంటే మట్టి కాదు మనుషులోయ్' అన్నాడో కవి దాని కొనసాగింపుగా 'వాళ్లతో బంధాలోయ్' అని ఉంటే బావుంటుంది. పిల్లలు రేపు పెరిగి పెద్దై, రెక్కలొచ్చి ఎగిరెళ్లిపోయినా మళ్లీ మాతృదేశం చెట్టుమీది గూళ్లకు వచ్చి చేరాలి. మాతోపాటు ఉండాలి. అదీ మా ప్రయత్నం. దానికి ఇప్పుడు విత్తనం నాటాము." అన్నాడు వీరేంద్ర.

కొడుకు చెట్టంతై మీకు నీడనిస్తానంటే ఏ తల్లిదండ్రులకైనా మనసు ఉప్పొంగిపోతుంది. ప్రస్తుతం అదే స్థితిలో ఉన్నారు వాళ్లు. ముందుగా శివనాథంగారు తేరుకుని, లేచెళ్లి కొడుకుని గట్టిగా ఆలింగనం చేసుకున్నారు. ఆ రెండు గుండెలూ కాసేపు స్పందనలతో సంభాషించుకున్నాయి. ఆ దృశ్యం చూసి పార్వతమ్మ చీర కొంగుతో కళ్లనీళ్లు తుడుచుకుంది.

*****

( పిల్లల మీద మమకారంతో, ప్రేమతో పెంచి పెద్దచేసి రెక్కలు తొడిగి వాళ్లకో అందమైన భవిష్యత్తుకోసం విదేశాలకు పంపితే, అక్కడే

వేళ్లూనుకోకుండా వెనక్కి, తల్లిదండ్రుల దగ్గరకు వచ్చే పిల్లలకు ఈ కథ మనస్ఫూర్తిగా అర్పితం-రచయిత)




నుదిటిపై నుండి చినుకుల్లా రాలుతోంది చెమట. శ్వాస వేగాన్ని పుంజుకుంటోంది. భయంతో బెదురు బెదురుగా పరుగెత్తుకొచ్చాడు. “అమ్మా..! అ....మ్మా..!” గుడిసె ముందు నిల్చొని కేకలేస్తున్నాడు పదేళ్ళ సూర్యం.

చుక్కమ్మకు రెండు రోజుగా జ్వరం. మూసిన కన్ను తెరవటం లేదు. కొడుకు ఏమంటున్నాడో కూడా సరిగా అర్థం చేసుకునే స్థితిలో లేదు. మొత్తానికేదో జరగరానిదే జరిగిందని గ్రహించింది. మెల్లగా లేచి కూర్చుంది. “యేందిరా! సూర్యం! యేమైంది?” బలహీనపడ్డ స్వరానికి చేతి సైగను జోడించింది.      తల్లికి దగ్గరగా వచ్చాడు. “అమ్మా! బర్రె పోయిందే...?”

“యేం...ట్రా...? బర్రె పోయిందా...?” చుక్కమ్మకు గుండె ఆగినంత పనైంది.

“అవునే..! ఊళ్ళో వాళ్ళ బర్రెలు బీట్లోకి రావడం చూసి, గడ్డిమేస్తున్న మన బర్రె బెదిరింది. తెగిపోయిన తాడు పట్టుకొని చాలా సేపు లాగాను. ముళ్ల కంపల్లోంచి చాలా దూరం ననీడ్చుకెళ్ళింది. దాన్నాపటం నా వల్ల కాలేదమ్మా” సూర్యం కళ్ళల్లో నీళ్ళు ఎగిసాయి. మందార పువ్వు లాంటి సూర్యం ముఖంపై మొలిచిన రక్తపు చుక్కలను చూస్తూ “యెంత పని జరిగిందిరా సూరి..”

అంటూ కొడుకును గుండెకు హత్తుకొంది.

మూడు పదు వయసు దాటకుండానే ఇద్దరు పిల్లలు. కామెర్ల కాటుకు కట్టుకున్నోడు బలయ్యాడు. మరుసటి ఏడాది వైరల్ జ్వరం చిన్న పిల్లాడిని తీసుకుపోయింది. మగతోడు లేని కుటుంబంలో తనకున్న ఒకే ఒక్క ఆధారం బర్రె. పొద్దంతా దాన్ని మేపుకురావడం, పాలు పిండటం ఆమెకు దినచర్యగా మారింది. పదిండ్లకు పాలు పోస్తూ... సూర్యాన్ని చదివిస్తూ... ధైర్యంగా బతుకెళ్ళదీస్తుంది. చుక్కమ్మకు జ్వరం రావటం మూలానా బర్రెను మేపే బాధ్యత సూర్యం మోయక తప్పలేదు. ఫలితం బర్రె అడవి వైపు పారిపోయింది.

శక్తినంతా కూడదీసుకొని మళ్ళొకసారి ఆర్ఎంపి దగ్గరకు వెళ్ళింది. ఇంజక్షన్ చేయించుకుంది. ఈ సారి మందు పని చేసినట్లుంది. సాయంత్రానికి జ్వరం నుంచి కాస్త తేరుకుంది చుక్కమ్మ.

*          *          *

రేయనక, పగలనక నాలుగు రోజులు అడవంతా గాలించింది. చేలన్నీ చుట్టొచ్చింది. చుట్టుప్రక్కల గ్రామాల్లోనూ ఆరా తీసింది. బర్రె జాడ దొరకలేదు. నిరాశతో గుడిసె ముందు కూలబడింది. బంగారం లాంటి బర్రెను తలుచుకుంటూ పెద్దగా ఏడ్వసాగింది.

“ఊర్కోవే! చుక్కమ్మా! ఊరుకో! నువ్వు మాలాగున్నా మాతో పాటు కూలి పనికి తీసుకపోదుము. ఒక కాలు వంకరదాయే? పొద్దంతా వంగి పని చేయటం నీ వల్ల కాదు. ఏం బతుకో ఏమో? ఎన్నడన్నా సుఖపడ్డది లేదాయే! మొగుడుబాయే! కొడుకుబాయే! యిన్నాళ్ళూ తోడున్న బర్రెబాయే! నీకన్నీ సీతమ్మోరి సెరలే! నువ్వేం బాధపడకు. కష్టాలు మనుషులకు కాకపోతే ఎవరికొస్తాయే? నీదెట్లాగో బస్టాండ్ పక్క ఇల్లే కాబట్టి ఛాయ్ దుకాణం నడుస్తది. నువ్వు కూర్చొని పని చేసుకోవచ్చు” తోచిన సలహాలిస్తూ ఇరుగు పొరుగు వారు ఓదార్చారు.

వాళ్ళ సలహా చుక్కమ్మకు ఒక దారి చూపినట్లు అన్పించింది. వెంటనే దానిని ఆచరణలో పెట్టింది. గుడిసె ముందు నాలుగు గుంజు పాతింది. మగబేరను పైకప్పుగా పేర్చింది. మూడేపులా కందికట్టెతో తడికు అల్లింది. పక్షి గూడంత అందంగా చిన్న హోటల్‌ను తయారు చేసింది. చూస్తుండగానే వ్యాపారం సజావుగా సాగటం మొదలైంది.

*          *          *

రయ్‌మంటూ దూసుకొచ్చి హోటల్ ముందాగిందో తెల్ల కారు. నలుగురు దిగారు. ఇస్త్రీ నగని తెల్లనిబట్టు, బూట్లు, కళ్ళజోడ్లతో అచ్చం సినిమా హీరోల్లా వున్నారు. "ఏం చుక్కమ్మ! బావున్నావా!" అంటూ పాకలోని బల్లపై కూర్చున్నారు. చుక్కమ్మ, సూర్యం ఆశ్చర్యంతో నోరెళ్ళబెట్టారు.

"గుర్తు పట్టలేదా? ఈ వూరోల్లమే! రావు గారిని" అంటూ కళ్ళజోడు తీసాడు పొడువాటి వ్యక్తి. అసలు పేరు సూర్యనారాయణ. వూరంతా రావుగారనే పిస్తారు.

"ఓ మీరా బాబు? సూటు, బూటు చూసి గుర్తు పట్టలేదు. టిఫిన్ తింటారా? చాయ్ తాగుతారా?"

"టిఫిన్ వద్దులే. టీలే ఇవ్వు"

క్షణాల్లో గ్యాస్ ముట్టించి, టీ తయారు చేసింది. "టీ చాలా బాగుంది!" అంటూ వంద రూపాయ కాగితం చేతిలో పెట్టాడు రావు గారు. చిల్లర ఇవ్వబోతే "ఫర్వాలేదులే వుంచు!" అన్నాడు.

"చుక్కమ్మా! నీ బర్రె పోయిందంటగా? నీకెన్ని కష్టాలు. ఈ పాక మాత్రం ఎన్ని రోజులుంటది. గట్టిగా గాలిస్తే కూలిపోతుంది. పాపం! ఒంటరి ఆడదానివి. మళ్ళీ ఇబ్బంది పడతావు. నీకో సాయం చేయానే ఇక్కడకి వచ్చాం. ప్రభుత్వం నుండి లోన్ ఇప్పిస్తాం. చక్కగా గోడ కట్టుకొని పైన రేకులు వేసుకున్నావంటే హోటల్ సూపర్‌గా వుంటుంది. ఏమంటావు?"

"మంచి చేస్తానని వస్తే ఎవరు మాత్రం వద్దంటారయ్యా? లోన్ రావాంటే నేనే సేయాలో చెప్పండి?" చుక్కమ్మ ఊహల్లో కొత్తగా మారబోతున్న హోటల్ రూపుదిద్దుకుంటుంది.

"నువ్వేం చేయొద్దు. ఒక సంతకం పడేస్తే అంతా మేం చూసుకుంటాం. టౌన్‌కు పోయి బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడి లోన్ ఇప్పిస్తాం" అంటూ కాగితాలపై చుక్కమ్మతో వేలిముద్రలు వేయించుకున్నాడు రావుగారు.

* * *

వారం గడిచింది. డుగ్..డుగ్.డుగ్..మంటూ ప్రొక్లైన్ వచ్చింది. దానెనుక రావు గారి బృందం దిగింది.      హోటల్, గుడిసె కూల్చేయమంటూ ఆజ్ఞాపించాడు రావు గారు.

“యిదేం అన్యాయం?” అయోమయంగా అడిగింది చుక్కమ్మ.

“ఈ స్థలం మాది. మాకు అమ్మినట్లు రుజువు ఈ రిజిస్ట్రేషన్ పేపర్లు. వాటిపై నీ వేలిముద్రలు కూడా      ఉన్నాయి. డబ్బు కూడా ఇచ్చాం కదా! ఏమీ ఎరగనట్లే అడ్డుపడుతున్నావే? జరుగు జరుగం”టూ ప్రొక్లైన్‌కు అడ్డొచ్చిన చుక్కమ్మను పక్కకు నెట్టేసాడు రావు గారు.      రావు గారి అసలు స్వరూపం చూసే సరికి చుక్కమ్మలో రౌద్రం రగిలింది. బలహీనుడి అడుగు ముందుకు పడనంత కాలం, ఇలాంటి వాళ్ళ ఆటలు సాగుతాయి అనుకుంది. ‘రేయ్... నా కొ...ల్లారా! ఎవడబ్బ సొత్తురా ఈ జాగా? కష్టమొకడిది, సుఖమొకడికా? ఆడదాన్నని కూడా చూడరా? మా పేదోళ్ళను బతకనీయరారా? దమ్మున్నోడు ముందుకు రండిరా!” పాకకు పాతిన గుంజల్లో ఒక దాన్ని, ఊడబీకి శివంగిలా లేచింది. దొరికిన వాడిని దొరికినట్టే బాదటం మొదలెట్టింది. ఉగ్రరూపం దాల్చిన చుక్కమ్మను తట్టుకోలేక కుయ్యో మొర్రోమంది రావు గారి బృందం.

ఊరంతా పోగయ్యేసరికి తల కొట్టేసినట్లైంది. “బుద్ధి గడ్డి తిని ఈ పని చేయాలని చూసాం. మమ్మల్ని క్షమించు చుక్కమ్మ” పశ్చాత్తాపంతో కుమిలిపోసాగాడు రావు గారు.

చుక్కమ్మలో రగిలిన చైతన్యం ఊరంతటికి వెలుగులు నింపింది. యిన్నాళ్ళూ రావు గారి బృందం ఆగడాకు బలై కూడా ప్రాణభయంతో నోరు మెదపని వారు సైతం “మంచి పని చేశావంటూ” చుక్కమ్మను అభినందించసాగారు. జరిగింది మంచికో, చెడుకో గానీ వెంటనే ఈ స్థలం సూర్యం పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించాలనే నిర్ణయానికొచ్చింది చుక్కమ్మ.




ఇద్దరం ఫ్రెండ్సుమి. కంపెనీలో కొత్తగా జాయినయ్యాం. మేం బ్యాచులర్స్ కావడం వల్ల ఎవరూ ఇంటిని అద్దెకివ్వకపోవడం, రెంట్లు ఎక్కువగా ఉండడంతో, మేమూ సై అనకపోవడం వల్ల ఇల్లు దొరక్క ఎంతో ప్రయాసాయసపడి ఇదిగో ఈ ఇల్లు అద్దెకు సంపాదించాం. ఊరికి దూరం అయితేనేం, తక్కువ అద్దెకు దొరికింది. ఓనర్స్ ఎక్కడో సిటీలో ఉంటారు. 'ఇంటిని జాగ్రత్తగా చూసుకోండి చాలు. మీరిచ్చినప్పుడే రెంట్ తీసుకుంటాను.' అని ఓనర్ అనడం మాకు అయాచిత వరం. విశాలమైన గదులతో, చుట్టూ కాపౌండ్ తో చిన్నపాటి భవనంలా ఉంటుంది. అద్దె కట్టినంత కాలం ఇది మాదే. ఆ ఆనందంతో ఉదయం ఇంట్లో దిగిన మేం, తోచినరీతిలో పాలు పొంగించుకుని కాఫీ తాగి కులాసాగా కబుర్లు చెప్పుకుంటున్నాం.

సాయంత్రం రాత్రిగా మారుతోంది.

ల్యాప్ టాప్ లో 'అవును' సినిమా చూస్తున్నాం. భయం గొంగళీపురుగులా ఒళ్లంతాపాకుతోంది. "ఒరే రఘు..కాసేపు ఆపేద్దాం రా" అన్నాను.

"ఏంటి భయమా..ఇది సినిమా అని మర్చిపోతున్నావు. సినిమాలో లీనమవ్వచ్చు కానీ హారర్ సినిమాలో కాదు'అని నవ్వి ఏమనుకున్నాడో కానీ ల్యాప్ టాప్ షట్ డౌన్ చేశాడు.

ఇద్దరం కబుర్లు చెప్పుకుంటున్నాం. మనసులోని బెరుకు పూర్తిగా పోలేదు.

ఏదో వాసన..కాలుతున్న వాసన..గుడ్డ కాలుతున్న వాసన..కమురు కంపు..ఎక్కడి నుంచో అర్థం కావడంలా..

మేం లేచి మూడు గదులూ చూశాం. ఊ హూ..

అప్పుడు చూశాం. బెడ్రూమ్ కు వెనక వైపు ఒక కిటికీ ఉంది. అది చాలా కాలం నుంచి తెరవనట్టుగా ఉంది. నిజానికి ముందు వైపున్న కిటికీలు తెరిస్తే ధారాళంగా గాలి వెలుతురు వస్తుంది. అందుచేత ఇప్పటిదాకా ఎవరూ అది తెరవ లేదనుకుంటా.

మేమిద్దరం కొద్దిసేపు కుస్తీపట్టి దాన్ని తీసే ప్రయత్నం చేశాం.

'కిర్..క్రిర్..కిర్..'అంటూ తెరుచుకుంది. అందులోంచి బయటకు చూసిన మాకు గుండె ఆగినంత పనైంది. కారణం అవతల వైపు శ్మశానం. పెద్ద పెద్ద మర్రిచెట్లు కాలుతున్న శవాలు. డబుక్కున కిటికీ వేసి కిందకూర్చున్నాం. స్టెత స్కోప్ లేకుండానే మా గుండె కొట్టుకునే వేగం తెలుస్తోంది.

తలుపు తీసుకుని బయటకొచ్చాం. మా ఇంటి చుట్టుపక్కల ఒక్క ఇల్లూ లేదు. దూరంగా స్ట్రీట్ లైట్ మినుకు మినుకు మంటోంది. ఇద్దరం ఉన్నాం కాబట్టి సరిపోయింది. అదే ఒక్కరం ఉండుంటే ఈపాటికి ఔటే.

మళ్లీ తలుపేసి లోపలికెళ్లాం.

రఘు సూట్ కేస్ ఓపెన్ చేసి ఆంజనేయస్వామి బొమ్మ తీసి టీపాయ్ మీద పెట్టాడు. కాస్త ధైర్యం వచ్చింది(అనిపించింది).

ఇంత వండుకు తిని పడుకున్నాం. రాత్రంతా ఆ కిటికీలోంచి ఏవేవో అరుపులు.. కేకలూ..ఏడుపులూ...వినిపిస్తూనే ఉన్నాయి.

మరుసటిరోజు ఆఫీసుకు వెళ్లాం.

సాయంత్రం ఇంటికొస్తుంటే మనసులో ఏదో బెరుకు. పోనీ ఖాళీ చేసేద్దామంటే మూడు నెలల రెంట్ అడ్వాన్స్ గా ఇచ్చాం. మాబోటి గాళ్లకు అది పెద్ద మొత్తమే..పైగా మళ్లీ ఇప్పటికిప్పుడు ఇల్లంటే ఎక్కడ దొరుకుతుంది?

ఇంట్లోకెళ్లి స్నానం చేసి కాఫీ తాగి..అన్నం గిన్నె గ్యాస్ స్టౌ మీద పెట్టి రాజేంద్రప్రసాద్ కామెడీ సినిమా పెట్టుకుని చూస్తున్నాం. సినిమాలో లీనమై నవ్వుతున్నాం. అంతలో 'టక్.టక్' అని కిటికీ తలుపు కొట్టిన చప్పుడు వినిపించింది.

ల్యాప్ టాప్ మ్యూట్ లో పెట్టి..కూర్చున్నాం..మళ్లీ చప్పుడు..ఒళ్లంతా చెమట్లు..మా గుండె చప్పుడు దాంతో పోటీ పడుతోంది..

"అయ్యా.."ఎవరిదో బొంగురు గొంతు కిటికీకి ఆవైపు నుంచి.

దెయ్యమే..అది దెయ్యమే..నోరు పిడచకట్టుకుపోతోంది.

"భయపడమాకండయ్యా..నేను కాటి కాపరి చొప్పన్నని..తలుపు తియ్యండి.."

మేము కాస్త ధైర్యం చేసి తలుపులు తీశాం.

నల్లగా నిగ నిగ లాడుతూ..తైల సంస్కారం లేని ఉంగరాల జుత్తుతో..భుజం పైన గొంగడితో..మెళ్లో నల్లని తాడుతో.."అయ్యా శవాన్ని తగలెయ్యాల అగ్గిపుల్లలు లేవు కాస్త ఇస్తారా"అన్నాడు.

"అసలే గుండాగి చస్తుంటే..వీడొకడు"అనుకుని అగ్గిపెట్టె ఇచ్చి తలుపులేశాం. కాటికాపరయితేనేం అవతల వైపు ఒక మనిషున్నాడనీ..అదీ శ్మశానంలో ఉన్నాడని తెలుసుకున్నాక గుండెకొట్టుకునే స్పీడు తగ్గుముఖం పట్టింది.

అప్పట్నుంచి సమయం దొరికినప్పుడల్లా వాడితో మాట్లాడే వాళ్లం. ఎప్పుడన్నా ఏవన్నా ఇచ్చినా తీసుకునేవాడు కాదు.

ఒకసారి కంపెనీ నుంచి వస్తుంటే ఎవరో 'ఈరోజు అమావస్య'అనడం విన్నాం.

అయితే ఇంతకుముందంత భయం లేదు. కారణం చొప్పన్న.

రాత్రి రక రకాల చప్పుళ్లు..ఏవో మంత్రాలు..ఊళలూ వినిపించసాగాయి. అంటే క్షుద్రపూజలు కూడా ఈ స్మశానంలో చేస్తారన్నమాట..అసలు చొప్పన్న ఎలా అనుమతిస్తున్నాడో?..అసలు అతనెక్కడ ఉంటాడో..రాత్రంతా కిటికీని గీరడం..దబ దబ బాదడం వినిపించింది.

రెండు రోజుల తర్వాత ఆఫీసు పని మీద బైటకెళ్లి ఇంటికి పెందళాడే వస్తుంటే రఘు వచ్చేలోపు, వెనకవైపు శ్మశానానికి వెళ్లి చొప్పన్నను చూసి రావాలనిపించింది.

అనుకుందే తడవు అటువైపుగా అడుగులేశాను. శ్మశానానికి దారి నిర్మానుష్యంగా ఉంది. నేను నడుస్తున్నాను.

"ఆగు" అని గట్టిగా వినిపించి ఆగిపోయాను.

తలంతా జడలుకట్టుకుపోయి, ముఖమంతా ముడతలలతో, చిరిగిన కాషాయ గుడ్డలతో ఒక సన్యాసిలాంటి వ్యక్తి అరుపది.

"ఒరే..నువ్వెక్కడికెళుతున్నావో తెలుసా? మృత్యుముఖంలోకి.. ఆ చొప్పన్న ఎవరో తెలుసా? ప్రేతాత్మ..నీతోపాటు ఉండేవాడి ఆత్మ. అది నిన్ను చంపేస్తుంది..వెళ్లిపోరా..వెళ్లిపో..అదృష్టవశాత్తు నేను చూసిన వాళ్లను రక్షిస్తున్నా..ఇప్పటి వరకూ ఎంతమందిని పొట్టన పెట్టుకున్నాడో వాడు" అన్నాడు.

"నువ్వు చెప్పేది నిజమైతే..అతనూ నాతోపాటు భయపడుతున్నాడు..ఆఁ..అన్నట్టు సూట్ కేస్ లోంచి ఆంజనేయస్వామి బొమ్మ కూడా తీశాడుగా" అన్నాను.

"అది నటనరా..వెర్రికుంకా..ఆ బొమ్మను పరిశీలనగా చూడు విషయం బోధపడుతుంది. అది ఆంజనేయస్వామిది కాదురా..అలా కనిపిస్తుందంతే.."అన్నాడు.

నేను భయంతో ఇంటివైపు ఎలా పరిగెత్తానో తెలీదు. లోపలికెళ్లి నా బట్టల పెట్టె తీసుకుని బయటకొస్తూ ఆంజనేయస్వామి విగ్రహం వంక చూశాను..అవున్నిజమే అది ఆంజనేయుడిదికాదు అలా కనిపించే మరేదో బొమ్మ. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగు మొదలెట్టాను. ఇన్నాళ్లూ నేనున్నది ప్రేతాత్మతోటా? తల గిర్రున తిరుతోంది. "ఏరా..ఎక్కడికి బయల్దేరావు?" దారిలో ఎదురై అడిగాడు రఘు.

"ఆ..ఆ..మానాన్నకు బాగాలేదట ఊరెళుతున్నాను." అని ఎలాగో చెప్పి వేగంగా పరిగెత్తుకుంటూ రోడ్డుకెళ్లి ఆటో ఎక్కాను. ఆటో రేర్ మిర్రర్లో వెనకవన్నీ కనిపిస్తున్నాయి..ఒక్క వా..డు..త..ప్ప...



“మురళీ! అన్నయ్యను ఒకసారి చూసి రావచ్చు కదా! ఈ మధ్య చాలా అనారోగ్యం చేసింది కదా!” అమ్మ ఒకటే గొడవ

“చూస్తున్నావుగా, నేనేమైనా ఖాళీగా ఉంటున్నానా, ఎప్పుడో ప్రొద్దున్ననగా వెళ్ళి మళ్ళీ రాత్రి పొద్దు పోయి వస్తున్నాను. ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగమంటే ఇలాగే ఉంటుందని తెలుసు కదా !” గట్టిగా అన్నాను

“ ఆ! ఒకప్పుడు ఉంది మరి ఖాళీ. ఏదో సమయంలో వీలు చేసుకొని వెళ్ళి చూసి వచ్చేసేదానికి” తిరిగి బదులిచ్చింది

“ఇపుడు ఏమంత కొంపలు మునిగిపోయాయని, నే వెళ్ళి చూడక పోతే; నాకు ఒంట్లో బాగో లేనపుడు అన్నయ్య వచ్చి ఏమైనా చూసి వెళ్ళాడా!” మనసులోని అక్కసును వ్రెళ్ళగక్కాను.

“ఆ! వాడప్పుడు ఏ ఇబ్బందుల్లో ఉన్నాడో ఏమో!” అమ్మ సమర్థింపు

“నీ కెప్పుడూ అన్నయ్య ను వెనకేసుకురావడం అలవాటే కదా! పోనీ నీకు ఒంట్లో బాగోలేనపుడు అయినా మొక్కుబడిగా వచ్చి ఒక అరగంట కూర్చొని వెళ్ళిపోయాడు కదా, అదీ నీకు గుర్తు లేదేమో” దెప్పి పొడిచాను.

“సరే! సరే ఇంక ఈ దెప్పిపొడవడం ఆపి వీలైతే ఒకసారి వెళ్ళి చూసిరా” అని చెప్పింది

“సరే, చూస్తానులే” అని చెప్పి అక్కడితో ఆ సంభాషణను ముగించా.

***********

నాన్న అన్నదమ్ములు ముగ్గురు, పెదనాన్న, నాన్న, చిన్నాన్న. నాన్న వాళ్ళది మారు మూల పల్లెటూరు. నాన్న ఉద్యోగరీత్యా ఈ పట్టణంలో స్థిర పడి పోయారు. పెద నాన్న, చిన్నాన్నలు, వారి పిల్లలు ఆ ఊరి లోనే ఉంటారు.

నాన్న, అన్నదమ్ములు చాలా ఆప్యాయంగా ఉండేవారు. అందుకే అక్కడ ఏ కార్యక్రమం జరిగినా, ఇక్కడ ఏ కార్యక్రమం జరిగినా అందరూ హాజరై ఎంతో సంతోషంతో గడిపే వారు. మా మధ్య ఆప్యాయతలు,అనురాగాలు వెల్లివిరిసేవి. కార్యక్రమాలు జరిగినన్ని రోజులు మంచి కోలాహలంగా సమయం గడిచిపోయేది.

************

మేమైతే ఇద్దరమే అన్నదమ్ములం.      అన్నయ్య ఈ ఊరిలోనే మరొక చోట ఉంటున్నాడు. ఎందుకో తెలియదు గాని నాన్న, అన్నయ్య నా పట్ల ముభావంగానే ఉండే వారు. నా చదువంతా అమ్మానాన్నలకు దూరంగా హాస్టల్ లోనే సాగింది. అన్నయ్యకు నాన్న ఉండగానే పెళ్ళయింది. నా పెళ్ళి, నాన్న చనిపోయిన తరువాత అన్నయ్య చేతుల మీదుగానే జరిగింది. అమ్మ నా వద్దకు, అన్నయ్య వద్దకు వస్తూ, వెళుతూ ఉంటుంది. పట్టణ వాతావరణంలో పెరగడమో లేదా అమ్మానాన్నలకు దూరంగా హాస్టల్ లో పెరగడమో లేదా నాన్న, అన్నయ్యలు నా పట్ల ముభావంగా ఉండటమో తెలియదు కాని అన్నయ్యతో నా అనుబంధం అంతంత మాత్రమే. అదిగో దానిలో భాగమే పై సంభాషణ.

*********************

ఒక రోజు వీలు చూసుకొని ఒక గంట అనుమతి తీసుకొని అన్నయ్యను చూడటానికి వాళ్ళింటికి వెళ్ళా. అన్నయ్య బాగా నీర్సంగా ఉన్నాడు. నన్ను చూసి నాకంటే ముందుగానే      " ఎలా ఉన్నావురా మురళీ? అమ్మ, జ్యోతి, పిల్లలు ఎలా ఉన్నారురా?" అని అడిగాడు అతి కష్టంగా .

"అంతా బానే ఉన్నారు. నువ్వెలాగున్నావు? అడిగా.

"ఆ! పర్వాలేదు. కాస్త నీర్సంగా ఉంది అని బదులిచ్చి తిరిగి ఏదో చెప్పబోతుంటే నేనే ఏమీ పట్టించుకోకుండా బయలుదేరి వచ్చేసా !

*********************

"మురళీ! ఊరి నుండి మీ పెద నాన్న వచ్చారు , అమ్మ తలుపు తీస్తూ పిలిచింది."

“రా! పెదనాన్న, ఎలా ఉన్నారు? పెద్దమ్మ, చిన్నాన్న, చిన్నమ్మ, అన్నయ్యలు, తమ్ముళ్ళూ, చెల్లెమ్మ అంతా కులాసాయేనా” అడిగాను

“అంతా కులాసాయేరా! మరి మీరంతా ఎలా ఉన్నారు” తిరిగి అడిగారు పెదనాన్న

“మేమంతా కులాసాయే, ఇంతకీ మన ఊరి విశేషాలేంటి?” అడిగా పెదనాన్నని.

“మీ తమ్ముడి పెళ్ళి రా!, అదే చిన్నాన్న వాళ్ళ అబ్బాయి పెళ్ళి, తప్పని సరిగా మీరంతా పెళ్ళికి రావాలి. మీ అన్నయ్య దగ్గరకు కూడా వెళ్ళి వస్తున్నాను. చాలా నీరసంగా ఉన్నాడు. పెళ్ళికి రమ్మన్నాను. ఏమాత్రం ఆరోగ్యం సహకరించినా తప్పనిసరిగా వస్తానన్నాడు. అందుకే చెప్తున్నా మీరైనా తప్పనిసరిగా రావాలి”

“ఓహో! అయితే నాకు తప్పదన్నమాట “ మనసులోనే అనుకొన్నాను.

“ ఇక బయలుదేరతాను” అన్నారు పెద నాన్న భోజనం చేసిన వెంటనే.

“ ఈ రోజుకి ఉండి వెళ్ళవచ్చు కదా పెదనాన్నా!”

“లేదు! లేదు!, చిన్నాన్న ఒక్కడూ అన్ని పనులు చూసుకోవడం కష్టమవుతుంది, వెళ్ళాలి” అని బయలుదేరారు.

*********************

పెళ్ళికి నేను, జ్యోతి మాత్రమే బయలుదేరాం. అమ్మ, అన్నయ్యకు ఒంట్లో బాగోలేదు కదా వాడి దగ్గరకు వెళ్తానంది. పిల్లలకు పరీక్షల సమయం కావడంతో వాళ్ళని ఇంటిలోనే ఉంచాల్సివచ్చింది. పెదనాన్న, చిన్నాన్న వాళ్ళది ఇప్పటికి ఉమ్మడి

కుటుంబమే. మేము వెళ్ళేసరికి పెళ్ళి యిల్లు పెళ్ళి పందిరితో బంధువులతో కళకళలాడుతూ ఉంది. పెదనాన్న, చిన్నాన్న మమ్మల్ని చూసి ఎదురొచ్చి మరీ ఇంటి లోపలికి తోడ్కొని తీసుకెళ్ళారు.

"ఏరా! అమ్మని, పిల్లలని తీసుకు రాలేదే!" పెద నాన్న ఆరా తీసారు.

" విషయాన్ని వివరించా, అర్ధంచేసుకొని సరే ! సరే మీరైనా వచ్చారు సంతోషం" అన్నారు.

" అన్నయ్య ఎలా ఉన్నాడురా! " చిన్నాన్న అడిగారు

" ఆ! పరవా లేదు" ముక్త సరిగా సమాధానమిచ్చా. పెదనాన్న, చిన్నాన్నల మధ్య అనుబంధం, వాళ్ళ పిల్లలు ఒకళ్ళనొకళ్ళు ఆప్యాయంగా పలకరించుకొనే తీరు చూసి నిజంగా చాలా ఆనందమేసింది. ఒక ప్రక్క అన్నయ్యతో నా అనుబంధం గుర్తుకు వచ్చి చాలా బాధగా అనిపించింది. చిన్నాన్న వాళ్ళ అమ్మాయిని పెద నాన్న వాళ్ళ కోడళ్ళు ఆట పట్టించడం, తను వెళ్ళి గారంగా పెదనాన్నకు ఫిర్యాదు చేయడం, పెద నాన్న వచ్చి కోడళ్ళను అనునయంగానే "అదెవరనుకొంటున్నారు, మా ఇంటి ఆడపడచు, దాన్ని ఏడిపిస్తారా!" అని గదమాయించినట్టు నటించడం చూసి ఎంతో ముచ్చటేసింది. అంతే కాదు పెద నాన్న పిల్లలు నా కూడా కూడా తిరుగుతూ తమ్ముడూ, తమ్ముడూ అని పలకరిస్తూ క్షణం కూడా విడిచి పెట్టకుండా ఉండటం, అలాగే చిన్నాన్న పిల్లలు అన్నయ్యా, అన్నయ్యా అంటూ ఒకటే హంగామా చేస్తుంటే ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యాను. పెళ్ళికి పెళ్ళి కూతురు యింటికి వెళ్ళడానికి సిద్ధమవుతున్నాము. ఇంతలో "ఒరేయ్! మురళి, ఇలా రా," అని ఒక ప్రక్కకు తీసుకెళ్ళారు పెద నాన్న.

*********************

"ఒరేయ్! మీ అన్నయ్యకు చాలా సీరియస్ గా ఉందట, ఇపుడే కబురొచ్చింది. ఇంకా ఎవరితోను అన లేదు. అందుకే నువ్వు వెంటనే బయలు దేరి వెళ్ళు, మిగతా విషయాలు నేను చూసుకొంటాను" అన్నారు.

పెద నాన్నతో సరే అన్నాను గాని, ఇంత వరకు ఉండి పెళ్ళి చూడకుండా అన్నయ్య దగ్గరకు వెళ్ళడమేంటి అనుకొని పెద నాన్న చూడకుండా పెళ్ళికి వెళ్ళా.

************************

పెళ్ళిలో నన్ను చూసి పెద నాన్న ఆగ్రహోదగ్రుడై ప్రక్కకు పిలిచి “ఒరేయ్! వెధవా! అసలు నీకు కనీస ఇంగిత జ్ఞానం ఉందా! అన్నయ్య అక్కడ చావు బతుకుల మధ్య ఉంటే ఇక్కడ నీకు పెళ్ళి కావాల్సివచ్చిందా, అసలు మీ అన్నయ్య గురించి నీకు ఏం తెలుసురా, నిన్నేదో ఆప్యాయంగా చూడటం లేదనుకొంటున్నావు కానీ అసలు అన్నయ్య అలా ప్రవర్తించటానికి కారణమేంటో నీకు తెలుసా! చెప్తా విను” అని చెప్పటం ప్రారంభించారు.

**************************

మీ అన్నయ్య తర్వాత, నీకు ముందు మీ అమ్మా నాన్నలకు ఒక బాబు పుట్టాడు. వాడంటే మీ అన్నయకు పంచ ప్రాణాలు. వాడ్ని విడిచి పెట్టి ఒక్క క్షణమైనా ఉండే వాడు కాదు. వాడిని ఎంతో గారాబంగా చూసుకొనేవాడు. వాడి మీద ఈగనైనా వాలనిచ్చేవాడు కాదు. మీ అమ్మానాన్నలు కూడా మీ అన్నయ్య, మీ చిన్నన్నయ్యలను అంతే గారాబంగా చూసుకొనే వారు. విధి వక్రించి వాడికి అయిదేళ్ళ వయసులో పెద్ద జబ్బు చేసి చనిపోయాడు. మీ అన్నయ్యకు అదో పెద్ద షాక్, ఆ షాక్ నుంచి కోలుకోవడానికి చాలా సమయమే పట్టింది. ఆ తర్వాతే నువ్వు పుట్టావు. నువ్వెక్కడ వాడిలాగే దూరమైపోతావనే భయంతో నిన్ను మీ నాన్న, మీ అన్నయ్య దూరంగా ఉంచి పెంచారు. అంతేగానీ నీ మీద ప్రేమ లేక కాదు, నువ్వంటే ఇష్టం లేక కాదు. అందుకే ఒకే ఊరిలో ఉంటూ వేరే చోట అన్నయ్య అద్దెకుండటానికి కారణం కూడా అదే. నీకు ఒంట్లో బాగుండక పోతే నిన్ను చూడటానికి ఇంటికి రాలేదని మాత్రమే తెలుసు కానీ, నీకు రక్తం ఎక్కించాల్సి వస్తే ఆ రక్తం యిచ్చింది నీ అన్న! అది కూడా నీకు తెలియనివ్వద్దొన్నాడు.

అంతెందుకు మీ అబ్బాయికి ఎంసెట్ లో ఎక్కువ ర్యాంక్ వస్తే మేనేజ్ మెంట్ సీట్ కి ప్రయత్నించావు గుర్తుందా! వాళ్ళకీ నీకూ సీట్ విషయంలో ఏభై వేల తేడా వల్ల నువ్వు వద్దని చెప్పి వచ్చేస్తే తర్వాత వాళ్ళు నువ్వు ఇస్తానన్న మొత్తానికే ఒప్పుకొంటున్నట్టు కబురు చేస్తే జాయిన్ చేసావు గుర్తు వచ్చిందా! ఇంతకూ జరిగినదేమిటో నీకు తెలుసా! మీ అన్నయ్య ఈ విషయాలన్నీ తెలుసుకొని ఆ ఏభై వేలు తను కట్టి వాళ్ళని ఆ విధంగా చెప్పమంటేనే మీ అబ్బాయికి ఆ సీటు వచ్చింది. అలాగే నీ కూతురు పెళ్ళి సమయానికి పనికి వచ్చేలా నీకు కూతురు పుట్టినపుడే నీ కూతురు పేర లక్ష రూపాయలు ఫిక్సెడ్ డిపాజిట్ చేసాడు అది నీకు తెలుసా! నీ మీద, నీ పిల్లల మీద నీ అన్నయ్యకున్న ప్రేమకు పరాకాష్ట ఏంటో తెలుసా! వాళ్ళకు పిల్లలు పుడితే ఎక్కడ నీ మీద, నీ పిల్లల మీద ప్రేమ తగ్గి పోతుందేమోనని వాళ్ళు కుటుంబ నియంత్రణ చేసుకొన్న పుణ్య దంపతులురా! నాకు తెలిసినవి ఈ కొన్నే, ఇంకా తెలియనవి ఇంకా ఎన్నో! ఇంకా పెద నాన్న ఏవో చెపుతున్నారు, కానీ నాకేవీ వినిపించుట లేదు, నా కళ్ళ వెంబడి ధారాపాతంగా కన్నీళ్ళు వర్షిస్తున్నాయి. ఎంత దారుణంగా అన్నయ్యను అపార్థం చేసుకొన్నాను. అన్నయ్యా! నన్ను క్షమించవా! నువ్వు నిండు నూరేళ్ళు చల్లగా బతకాలి అని మనసులోనే ఆ భగవంతుని ప్రార్థించా! ఇక ఒక క్షణం ఆలస్యం చేయకుండా సరా సరి అన్నయ్య ఉన్న హాస్పిటల్ కి చేరుకొన్నా.

***********************

భగవంతుడు నా మొర ఆలకించాడు. అన్నయ్య కొద్ది కాలంలోనే కోలుకొన్నాడు. ఆ యిల్లును ఖాళీ చేయించి అన్నయ్య, వదినను, అమ్మతో సహా శాశ్వతంగా నా యింటికి అదే మా యింటికి తీసుకొచ్చేసా. ఇపుడు మా కుటుంబం అనుబంధాలతో అల్లుకొన్న హరివిల్లు.

*****